సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 24-11-2023 15/-







## ముహబ్బత్ కీ దుకాన్ ఇదేనా?



మానవులంతా ఒక్కటే ... దేవుడు ఒక్కడే

నీ ఓటు ఎవరికి? ధర్మాన్ని నమ్మేవాడు

## అధర్మంగా ఓటు వేయడు



గీటురాయి
సహజీవన భావాల పావురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి 45 సంచిక: 46 హైదరాబాద్
శుక్రవారం 24 నవంబర్ 2023 రూ.15-00
9 జమాదిఉల్ ఊలా 1445 హిజ్రీ

**తొలిగీటు**

అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైన సుగుణాలు మీలో రెండున్నాయి. ఒకటి సహనం, రెండవది తొందరపాటు లేకపోవటం.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




## లోపల...


| | | |
|---|---|---|
| తెలంగాణ | ...... | 04 |
| ముహబ్బత్ కీ దుకాన్ ఇదేనా? | ...... | 05 |
| నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)-6 | ...... | 08 |
| ధర్మాన్ని నమ్మేవాడు అధర్మంగా ఓటు వేయడు | ...... | 10 |
| మానవులంతా ఒక్కటే ...దేవుడు ఒక్కడే | ...... | 14 |
| ఫేక్ న్యూస్ రౌండప్ | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మూఢనమ్మకాల అంధకార లోయల్లో అరబ్బులు | ...... | 20 |
| చరితార్థులు-2 : పఠాన్ సలాబత్ ఖాన్ | ...... | 23 |
| మేఘ గర్జన (పుస్తక సమీక్ష) | ...... | 24 |
| చదువు సంస్కారం | ...... | 30 |
| సిరా చుక్కలు శోక సంద్రంలో (కవిత) | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| అహంకారం ఏ మాత్రం పనికిరాదు | ...... | 34 |


**మేకపోతు గాంభీర్యం!!**




అంగరంగ వైభవంగ
అభ్యర్థులు ప్రచారం
వీరలెవల్ ఫోజులతో
ఊరువాడ సంచారం!

పైకి భలే చిరునవ్వు
లోలోపల గుబులు
ఏమవుద్దో ఏమోనని
మనసంతా దిగులు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## తెలంగాణ

తెలంగాణలో ముస్లిం సముదాయం పెద్ద సంఖ్యలో ఉంది. గత రెండు ఎన్నికల్లో ముస్లిములు నిర్ద్వంద్వంగా కేసీఆర్‌కు మద్దతిచ్చారు. కాని ఇప్పుడు కాంగ్రెసు పుంజుకుంది. దేశ వ్యాప్తంగా భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ కాంగ్రెసులో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెసు అవినీతికి వ్యతిరేకంగా ప్రచారం చేసింది. బీజేపీ హిందుత్వ రాజకీయాలే నడిపింది. బీజేపీకి ఆ ఎన్నికల్లో తలబొప్పి కట్టింది. కాని కర్నాటకలో కాంగ్రెసు పోటీ సూటిగా బీజేపీతోనే, అక్కడ ప్రాంతీయ పార్టీ ఏదీ రంగంలో లేదు.

తెలంగాణలో కూడా కాంగ్రెసు కర్నాటక ఫలితాలు సాధించాలనుకుంటోంది. ముఖ్యంగా తెలంగాణలో ముస్లిం ఓట్లు తనవైపు తిప్పుకుంటే కాంగ్రెసుకు విజయం సులభం కావచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడి ముస్లిములు బీఆరెస్ వెంటనే ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో కూడా ముస్లిములు అగ్రభాగాన ఉండి పోరాడారు. హైదరాబాదు నగరంలో మజ్లిస్ పార్టీ బీఆరెస్‌కు మిత్రపక్షంగా ఉండడం వల్ల కూడా ముస్లింల ఓట్లు బీఆరెస్ ఖాతాలోకి వెళ్ళడం సాధ్యపడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిములు కాంగ్రెసుకు మద్దతిచ్చేవారు. 2014 తర్వాతి నుంచి పరిస్థితి మారింది. మళ్ళీ ముస్లిము ఓట్లను తమవైపు తిప్పుకోడానికి కాంగ్రెసు ప్రయత్నిస్తోంది. బీఆరెస్ నిజానికి బీజేపీ బీ టీముగా చిత్రీకరిస్తున్నారు. ఈ మాటల్లో వాస్తవాలు ఎలా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ఉన్న 13 శాతం ముస్లిం ఓట్లు నిర్ణయాత్మకమైనవి. దాదాపు 40 సీట్లలో ముస్లిము ఓట్లే కీలకం.

ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెసు పూర్తిగా పతనమయ్యింది. బీజేపీ బలపడుతున్న సూచనలు బలంగా కనిపించాయి. ఈ నేపథ్యంలో ముస్లిములు బీఆరెస్ వైపు మొగ్గు చూపారు. బీఆరెస్ ముస్లిం సంక్షేమానికి చర్యలు తీసుకుంది, కాని ముస్లిముల రాజకీయ ప్రాతినిధ్యానికి బీఆరెస్ పెద్దగా శ్రద్ధ తీసుకోలేదు. ఇప్పుడు బీఆరెస్‌లో ముస్లిము ముఖాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. నవంబర్ 30వ తేదీన ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెసులో అనుభవం ఉన్న ముస్లిం నేతలున్నారు. బీఆరెస్ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ముస్లిముల విషయంలో బీఆరెస్ వైఖరిని ప్రశ్నించే అనేక సంఘటనలున్నాయి. కాంగ్రెసు నాయకులు వాటన్నింటిని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంటులో అనేక సందర్భాల్లో బీఆరెస్ బీజేపీకి మద్దతిచ్చిన ఉదాహరణలను తెస్తున్నారు.

బీఆరెస్ సంక్షేమ కార్యకలాపాలకు జవాబుగా కాంగ్రెసు అనేక వాగ్దానాలు చేస్తోంది. ముస్లిముల సంక్షేమానికి హామీలు ఇస్తోంది. రిజర్వేషన్ల విషయంలో కూడా స్పష్టమైన హామీతో ముందుకు వస్తుంది. మరోవైపు బీఆరెస్ కూడా ముస్లిములకు అనేక వాగ్దానాలు చేస్తోంది. బీజేపీ, కాంగ్రెసు రెండు ఒకే నాణానికి రెండు పార్శ్వాలని ప్రచారం చేస్తున్నారు. మజ్లిస్‌తో మైత్రి కూడా ముస్లిముల ఓట్లను సంపాదించుకోడానికి తోడ్పడుతుందని ఆశిస్తోంది. క్లుప్తంగా చెప్పాలంటే ఇప్పుడు ముస్లిం ఓట్లు కాంగ్రెసుకు, బీఆరెస్‌కు మధ్య చీలిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

తెలంగాణలో అత్యంత బలహీనంగా ఉందనుకుంటున్న బీజేపీకి ఇప్పుడు ఈ ఓట్ల చీలిక అనుకోని వరంగా లభించే అవకాశాలున్నాయని పలువురు భావిస్తున్నారు. ముస్లిం సముదాయం రాజకీయ పరిణతిని ప్రదర్శించకపోతే, ఓట్ల చీలికను నివారించలేకపోతే, బీజేపీ ఊహించని సంఖ్యలో స్థానాలు సంపాదించుకోవచ్చు.

అబ్దుల్ వాహెద్






# ముహబ్బత్ కీ దుకాన్ ఇదేనా?

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో మతవిద్వేషాన్ని రెచ్చగొట్టే శక్తులపై మండిపడ్డారు. విద్వేషాల బాజారులో తాను ప్రేమాభిమానాల దుకాణం తెరుస్తున్నానని గర్వంగా చెప్పారు. రాహుల్ గాంధీ ప్రసంగాల్లో నిస్సందేహంగా ఆ పట్టుదల కనిపిస్తుంది. అంతెందుకు ఇప్పుడు వరల్డ్ కప్ క్రికెట్టులో అసాధారణ ప్రతిభ చూపించిన ముహమ్మద్ షమీ విషయంలో 2021లో పాకిస్తాన్‌తో జరిగిన టి20 మ్యాచ్‌లో భారతదేశం ఓడిపోయింది. అప్పుడు దేశంలోని మతతత్వ ఆన్ లైన్ ట్రోల్ మూకలు ముహమ్మద్ షమీ మతాన్ని తీసుకొచ్చి, అతన్ని ఓటమికి బాధ్యుడిగా చేసి ట్రోల్ చేస్తున్నప్పుడు రాహుల్ గాంధీ బలంగా ముహమ్మద్ షమీ పక్షాన నిలబడ్డారు. రాహుల్ గాంధీ నిజాయితీ గానే దేశంలో తన ప్రేమాభిమానాల దుకాణాన్ని తెరువాలనుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ నేతలకు ఈ పని ఇష్టముందా? కాంగ్రెసు అవకాశవాద రాజకీయాలు నడుపుతూ అవసరమైతే సాఫ్ట్ హిందుత్వ ప్రయోగిస్తూ నెట్టుకు రావడానికి ప్రయత్నించడం లేదా? రాహుల్ గాంధీ నిజాయితీ గానే ప్రయత్నాలు చేస్తుండవచ్చు, కాని ఆ ప్రయత్నాలను కాంగ్రెస్ నేతలు సఫలమయ్యేలా చేస్తారా? లేక అడ్డుకుంటారా? ఇటీవలి కొన్ని పరిణామాలను గమనిస్తే అనుమానాలు పెరుగుతున్నాయి.

కర్నాటకలో ఇప్పుడు కాంగ్రెసు ప్రభుత్వం ఉంది. కర్నాటక ఎగ్జామినేషన్ అథారిటీ ఇటీవల రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అభ్యర్థులు పరీక్ష రాస్తున్నప్పుడు తలపై ఎలాంటి అచ్ఛాదన ధరించరాదని కొత్త నియమాన్ని తీసుకువచ్చింది. పరీక్ష హాలులో బ్లూ టూత్, ఇయర్ ఫోన్లు వగైరా ఏవీ ధరించరాదని ఆంక్షలు పెట్టడంలో అర్థముంది. తలపై ఏదీ ధరించరాదన్న ఆంక్ష దేనికి? ఈ ఆంక్ష వల్ల ప్రభావితులయ్యేది ముఖ్యంగా ముస్లిం బాలికలే. బ్లూటూత్‌లు వగైరా పరికరాలను కేవలం తలపై ధరించే ఆచ్ఛాదనలోనే దాచుకుని వస్తారా అభ్యర్థులు. అయినా పరీక్షకు ముందు చెకింగు జరుగుతుంది కదా? ఈ ఆంక్ష వెనుక ఉన్న మతలబేమిటి? ఈ వార్త మీడియాలో వచ్చిన తర్వాత కర్నాటక ప్రభుత్వం రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో హిజాబ్‌పై బ్యాన్ ఏదీ లేదని ఒక వివరణ ఇచ్చింది. కాని ఇలాంటి నిర్ణయాలు ఎందుకు వస్తున్నాయన్నది ఆలోచించవలసిన ప్రశ్న. ఇంతకు ముందు కర్నాటకలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థల్లో ముస్లిం బాలికలు ధరించే హిజాబ్‌ను నిషేధించింది. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిజాబ్ బ్యాన్‌పై ఇంతవరకు చేసిందేమీ లేదు.

### మధ్యప్రదేశ్ విషయం చూద్దాం.

మధ్యప్రదేశ్‌లోని చత్తార్ పూర్‌లో ఉన్న అంగోర్ గ్రామంలో ఏడాది క్రితం ఒక దళిత యువకుడు తన పెళ్ళికి గుర్రంపై

ఊరేగింపుగా వెళ్లాలనుకున్నాడు. కాని అక్కడి బ్రాహ్మణులు, రాజపుత్రులు దానికి ఒప్పుకోలేదు. చివరకు పోలీసులు వచ్చారు. ఆ దళిత యువకుడు గుర్రంపై వెళ్ళాలనుకున్న కోరిక తీరలేదు. ఆ ఊరు మొత్తం ఉద్రిక్తత అలుముకుంది. ఇది మధ్యప్రదేశ్ పరిస్థితి. ఈ చత్తార్ పూర్ జిల్లాలోనే భాగేశ్వర్ థామ్ ఉంది. మధ్యప్రదశ్ లో అత్యంత వెనుకబడిన జిల్లా ఇది. ఇక్కడ కులవివక్షకు సంబంధించి ఇలాంటి సంఘటనలు ఎన్నెన్నో. ఇక్కడ భాగేశ్వర్ థామ్ కార్యకలాపాలు పెరిగిన తర్వాత కులవివక్ష మరింత పెరిగిందన్న ఆరోపణలున్నాయి. భాగేశ్వర్ థామ్‌లో భాగేశ్వర్ బాబాగా పిలువబడే ధీరేంద్రశాస్త్రి విద్వేష ప్రసంగాలు బాహాటంగా చేస్తుంటాడు. సనాతన ధర్మాన్ని విశ్వసించని వాళ్ళు, రాముడి కోసం జరిగే పనిని అడ్డుకునేవాళ్ళు, హిందూ రాష్ట్రను అడ్డుకునే వారి ఇండ్లను బుల్ డోజర్లతో కూల్చేయాలని చెప్పాడు. భాగేశ్వర్ బాబాతో బీజేపీ నేతలు సన్నిహితంగా ఉండడం అర్థం చేసుకోవచ్చు. కాని బీజేపీ కన్నా ఇప్పుడు కాంగ్రెసు నేతలు ఈ బాబాకు ప్రణమిల్లుతున్నారు. నవంబర్ 17వ తేదీన మధ్యప్రదేశ్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెసు ముఖ్యమంత్రిగా ప్రచారమవుతున్న కమల్‌నాథ్ భాగేశ్వర్ బాబాను రాసుకుపూసుకు తిరుగుతున్నారు. ముస్లిములకే కాదు, దళిత, వెనుకబడిన సముదాయాలకు కూడా ఇది మింగుడు పడడం లేదు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసును కమల్‌నాథ్ ముంచుతాడని చాలా మంది భావిస్తున్నారు. అంతెందుకు, దేశంలో విద్వేష వాతావరణానికి కారణమవుతున్న కొందరు యాంకర్లను ఇండియా కూటమి బహిష్కరిస్తూ ఒక ప్రకటన చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. ఆ యాంకర్లలో ఒక చానల్ యాంకర్‌ను పిలిచి సగౌరవంగా తనతో పాటు కూర్చో బెట్టుకుని ఇంటర్వ్యూ ఇచ్చిన నాయకుడు కమల్‌నాథ్.

మధ్యప్రదేశ్ కాంగ్రెసు నాయకుడు కమల్‌నాథ్ ఇప్పుడు చేస్తున్న పని సాధువులను రాసుకుపూసుకు తిరగడం, విగ్రహాలను నిర్మించడం వగైరా. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ సాఫ్ట్ హిందూత్వ లేకపోతే గెలవలేమనే స్థాయిలో ఉంది. రాహుల్ గాంధీ చెప్పే ముహబ్బత్ కా దుకాన్ ఇదేనా? కమల్ నాథ్ ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ కోర్ ఓటు బ్యాంకు చెక్కుచెదిరేది కాదని, సాఫ్ట్ హిందూత్వ ప్రయోగాలు ఇంతకు ముందు కూడా కాంగ్రెసు పుట్టి ముంచాయని చాలా మంది విశ్లేషిస్తున్నారు. అయినా కాంగ్రెసు నేతలు అవకాశవాద రాజకీయాలు మానుకోవడం లేదు. కమల్ నాత్ సాఫ్ట్ హిందూత్వ రాజకీయాల వల్ల నిజానికి బీజేపీకే లాభమని కూడా చాలా మంది భావిస్తున్నారు. ముఖ్యంగా ఛత్తార్ పూర్‌లో వెనుకబడిన వర్గాలు, బలహీన వర్గాల ప్రజలు కాంగ్రెసుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. అలాగే ముస్లిములు కూడా దూరమయ్యే ప్రమాదం ఉంది.

నిజానికి ఛత్తార్‌పూర్‌లో వెనుకబడిన వర్గాలు ఇప్పటి వరకు బీజేపీ వెంటే ఉన్నాయి. కాని ఇటీవల బీజేపీ పట్ల విసుగు కూడా వారిలో కనిపిస్తుంది. కాని ఇప్పుడు కాంగ్రెసు కూడా అదే బాటన నడుస్తుంటే బీజేపీని వదిలి కాంగ్రెసు వైపునకు వచ్చే బదులు బీజేపీ వెంటే ఉండడం మంచిదని కూడా వాళ్ళు భావించవచ్చు. కమల్ నాథ్ హిందూత్వ రాజకీయాలు ఇప్పుడు కాంగ్రెసుకు ఉచ్చు బిగుస్తున్నాయి. భాగేశ్వర్ బాబాతో కాంగ్రెసు, బీజేపీలు ఎంతగా రాసుకుపూసుకు తిరుగుతున్నాయంటే, బీజేపీ ఛత్తార్‌పూర్ జిల్లాలో కథా కార్యక్రమాలు అనేక చోట్ల నిర్వహించింది. కమల్ నాథ్ కూడా పోటీగా నిర్వహించాడు. చత్తార్‌పూర్‌లో బాబాను సందర్శించాడు.

దళిత వర్గాల్లోను, ముస్లిముల్లోను భాగేశ్వర్ బాబా ప్రసంగాలు వ్యాఖ్యల పట్ల ఆగ్రహం ఉంది. ఒక దళిత యువకుడు తన పెళ్ళికి గుర్రంపై ఎక్కే పరిస్థితులు కూడా లేని సమాజాన్ని దళితులు వ్యతిరేకిస్తున్నారు. అలాగే వెనుకబడిన వర్గాలు కూడా ఈ సారి కేవలం వెనుకబడిన వర్గాల అభ్యర్థులకే ఓటు వేయాలని భావిస్తున్నాయి. కాంగ్రెసు కుల జనగణన గురించి మాట్లాడుతుంది. కాని మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు నేతల వైఖరి చూస్తే కుల జనగణనపై కాంగ్రెసును నమ్మలేమన్న భావన వెనుకబడిన వర్గాల్లో పెరుగుతోంది. మధ్యప్రదేశ్‌లో మొత్తం 230 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో కేవలం 62 స్థానాల్లో మాత్రమే వెనుకబడిన వర్గాలను కాంగ్రెసు నిలబెట్టింది. బీజేపీ 71 మందికి టిక్కెట్లు ఇచ్చింది. కేవలం వెనుకబడిన వర్గాల అభ్యర్థికి మాత్రమే ఓటు వేయాలన్న ధృఢమైన సంకల్పం ఈ సారి వెనుకబడిన వర్గాల్లో కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో ముస్లిముల శాతం చాలా తక్కువ. కేవలం 6 శాతం ఓట్లు మాత్రమే ఉన్నాయి.

కమల్ నాథ్ వైఖరి మరికాస్త లోతుగా చూడడం అవసరం. నవభారత్ టైమ్స్ అనే టీవీ చానల్‌లో ఒక కార్యక్రమం వచ్చింది. గర్బా అనే హిందూ పండుగ కార్యక్రమంలో ముస్లిములు పాల్గొని అక్కడ లవ్ జిహాద్ చేస్తున్నారన్నట్లు మతవిద్వేషాన్ని రెచ్చగొట్టే ఈ కార్యక్రమానికి యాంకర్ నావికా కుమార్. ఈ కార్యక్రమం విషయంలో NBDSA అంటే News Broadcasting & Digital Standards Authority తీవ్రమైన ఆక్షేపణ తెలియజేసింది. ఈ కార్యక్రమంలో మతవిద్వేషాలను వ్యాపింపజేసే ప్రయత్నాలు చేసినందుకు టైమ్స్ నౌ నవభారత్ చానల్ వెంటనే ఈ కార్యక్రమాన్ని తొలగించాలని కూడా ఆదేశించింది. ఈ కార్యక్రమం యాంకర్ ఇంతకు ముందు చెప్పుకున్నట్లు నావికా కుమార్. ఇండియా కూటమి నిషేధించిన యాంకర్ల జాబితాలో ఈ పేరు కూడా కనిపిస్తుంది. ఈ యాంకర్ల ఏ కార్యక్రమంలోనూ ఇండియా కూటమి నేతలు, ప్రతినిధులు పాల్గొనడం జరగదని

ప్రకటించారు. ఈ కూటమిలో పెద్దన్న కాంగ్రెసు. ఇప్పుడు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు ముఖ్యమంత్రిగా ముందుకు వచ్చిన కమల్ నాథ్ స్వయంగా ఈ నావికాకుమార్‌ను పిలిచి ఇంటర్వ్యూ ఇచ్చాడు. హెలికాప్టరులో తన పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడాడు. ఈ ఇంటర్వ్యూ వచ్చింది. ఇండియా కూటమి నిర్ణయాలకు కాంగ్రెసు పెద్దలు కట్టుబడరాదని అనుకున్నప్పుడు ఆ కూటమిలో ఎందుకు ఉన్నట్లు? అందుకే ఉమర్ అబ్దుల్లా కుండబద్దలు కొట్టినట్లు కాంగ్రెసు నాటకం ఇప్పుడే బయటపడడం మంచిదయ్యిందన్నాడు.

కాంగ్రెసులో రాష్ట్రాల్లో ఉన్న పెద్ద పెద్ద నాయకులు అధిష్ఠానం కంట్రోలు లేరన్న వార్తలు కూడా వస్తున్నాయి. ఇదే నిజమైతే రాహుల్ గాంధీ నాయకత్వమే ప్రశ్నార్థకమవుతుంది. ఇండియా కూటమిని బలహీనపరచడంలో కాంగ్రెసు హస్తం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో సమాజవాది పార్టీకి మధ్యప్రదేశ్‌లో సీట్లు ఇచ్చారు. సమాజవాది పార్టీ అప్పుడు తన అభ్యర్థులను నిలబెట్టింది. ఈ సారి సమాజవాది పార్టీకి సీట్లు ఇవ్వలేదు. ఈ విషయమై కమలనాథ్‌ను అడిగినప్పుడు, అఖిలేష్ విషయంలో చాలా అమర్యాదగా ప్రతిస్పందించారు. ఒక మాజీ ముఖ్యమంత్రి గురించి, ఇండియా కూటమిలోని ఒక ముఖ్యమైన పార్టీ అధినేత గురించి అమర్యాదగా కాంగ్రెసు నాయకుడు మాట్లాడితే ఇండియా కూటమిలో కాంగ్రెసు ఎలాంటి పాత్ర పోషిస్తున్నట్లు. అఖిలేష్ యాదవ్ దీనిపై మండిపడ్డారు. కాంగ్రెసులోని చిల్లర నాయకులు చేసే వ్యాఖ్యలను కాంగ్రెసు అదుపు చేయడం మంచిదని జవాబిచ్చారు. అంతేకాదు, కాంగ్రెసు ఇప్పుడే అసలు రంగు చూపించడం మంచిదయ్యిందన్నాడు. ఉత్తరప్రదేశ్‌లో కూడా కాంగ్రెసు, సమాజవాది పార్టీల మధ్య సయోధ్య లేదు. దాడులు ప్రతిదాడులు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోను, ఉత్తరప్రదేశ్‌లోను కాంగ్రెసు నాయకులు ఇప్పుడు ఇండియా కూటమికి తూట్లు పొడిచే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు. బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తనకు చేతనైన ప్రయత్నాలు చేస్తున్నారు.

మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్, దిగ్విజయ్ సింగ్ వంటి నేతలు తమను తాము ఫ్యూడల్ ప్రభువులనుకుంటారు. రాష్ట్రం తమ స్వంత సామ్రాజ్యం అనుకుంటారు. ఇటీవల దిగ్విజయ సింగ్ ఒక వ్యాఖ్య చేశాడు. బీజేపీ నాయకులు మస్జిదులకు వెళ్ళే ప్రయత్నాలు కూడా చేస్తుంటారని అన్నాడు. బీజేపీ నేతలు మందిరాలకు వెళితే ఏమిటి? మస్జిదులకు వెళితే ఏమిటి? వాళ్ళ ప్రచారం వాళ్ళు చేసుకుంటారు. ప్రధాని మోడీ, ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ఇప్పుడు ముస్లిముల గురించి మాట్లాడుతున్నారని కూడా దిగ్విజయ సింగ్ అన్నాడు. ఇక్కడ ఆలోచించవలసిన ప్రశ్న ఏమిటంటే, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు ప్రజాసమస్యలపై ఎన్నికల్లో పోరాడుతుందని చెప్పుకున్నారు. కొంతివరకు కమల్ నాథ్ ప్రచారంలో కూడా ప్రజాసమస్యలను ప్రస్తావిస్తూ వచ్చాడు. కాని అకస్మాత్తుగా దిగ్విజయ్ సింగ్ మస్జిదు గురించి మాట్లాడి ఎవరి మస్జిదుకు వెళ్ళే నేతలు అనే చర్చకు తెరతీశాడు. ఈ చర్చ ప్రారంభించవలసిన అవసరం దిగ్విజయ్ సింగ్ కు ఏమొచ్చింది? దిగ్విజయ్ సింగ్ అంతటితో ఆగలేదు. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడే పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాపై బీజేపీ చర్యలు తీసుకుంటుందని అన్నాడు. దీనికి జవాబుగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ మాట్లాడుతూ పిఎఫ్ఐ పై చర్యలు తీసుకుంటే కాంగ్రెసుకు ఏమన్నా కష్టమా? ఈ చర్యలను వ్యతిరేకిస్తున్నారా? అని ప్రశ్నించారు. అంటే మొత్తం చర్చ ఇప్పుడు మతతత్వ చర్చగా మారిపోయింది. ఇలాంటి చర్చను తీసుకొచ్చింది ఎవరు? దిగ్విజయసింగ్ ఈ వ్యాఖ్యలు ఎందుకు చేస్తున్నట్లు? మధ్యప్రదేశ్‌లో ఇప్పుడు దిగ్విజయ సింగ్, కమలనాథ్ మధ్య పోటీ నడుస్తోంది.

మధ్యప్రదేశ్‌లో ప్రజలు బీజేపీ పట్ల విసిగిపోయారని, కాంగ్రెసు గెలిచే అవకాశాలున్నయని విశ్లేషణలు వస్తున్న నేపథ్యంలో కూడ ఈ సాఫ్ట్ హిందూత్వ కమల నాథ్‌కు ఎందుకు అవసరమయ్యింది. ఇండియా కూటమి నిర్ణయాన్ని తుంగల్లో తొక్కి బహిష్కరించిన యాంకర్‌కు ఇంటర్వ్యూ ఇచ్చి ఇండియా కూటమిని బలహీనపరిచే పని ఎందుకు చేస్తున్నట్లు? మధ్యప్రదేశ్‌లో బాబాలు, సాధువులతో, మతవిద్వేష వ్యాఖ్యలు చేసేవారితో సన్నిహితంగా కమల నాథ్ ఎందుకు వ్యవహరిస్తున్నట్లు? NBDS స్వయంగా ఏ యాంకరు కార్యక్రమాన్ని మతవిద్వేషాల కార్యక్రమంగా పేర్కొని ఆదేశాలు జారీ చేసిందో అదే యాంకరును పిలిచి ఎందుకు ఇంటర్వ్యూ ఇచ్చినట్లు?

నిస్సందేహంగా రాహుల్ గాంధీ నిర్భయంగా సంఘపరివార్‌కు వ్యతిరేకంగా గొంతువిప్పుతున్నారు. సంఘపరివార్ ఇప్పుడు అస్సలు ఇష్టపడని నాయకుడు రాహుల్ గాంధీ అనేది కూడా నిజమే. రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తును నాశనం చేయడానికి, పప్పుగా ప్రచారం చేసి తొక్కేయడానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదన్నది నిజమే. రాహుల్ గాంధీ నిజాయితీగా దేశంలో అసలు సమస్యలపై మాట్లాడుతున్నారు. నిజాయితీగానే మతవిద్వేషాన్ని వ్యతిరేకిస్తున్నారు. కానీ, ఆయన పార్టీ నాయకులేం చేస్తున్నారు? కమలనాథ్, దిగ్విజయసింగ్ వంటి నేతలను అదుపు చేయవలసిన బాధ్యత కూడా రాహుల్ గాంధీపైనే ఉంది. ఆ పనిలో ఆయన విఫలమైతే, ఆయన సామర్థ్యమే ప్రశ్నార్థకమవుతుంది. కాంగ్రెసు ఒక నమ్మశక్యం కాని పార్టీగానే గుర్తించబడుతుంది. ✤

అధ్యాయం -2

6

# నిర్ధారణాగ్రేసరుడు మహనీయ అబూ బక్ర్ (రజి)

ఎస్.ఎమ్. మలిక్

## అబూ బక్ర్ పాత్ర

ఆ పైన దుప్పటితో ముఖం కప్పి వేసి, గది వెలుపలికి వచ్చి చూశారు, మహనీయ ఉమర్ పైన ప్రవక్త దివంగతులవడం ఎనలేని ప్రభావం వేసిందని గమనించారు. ఆయన ఎంతో ఉద్రిక్తులయి గుమికూడిన జనులతో, "ప్రవక్త మహనీయులు దివంగతులవలేదు. ఆయన(స) అస్తమించారని అన్నవారి కాళ్ళూ చేతుల్ని నరికివేస్తార"ని అంటున్నారు. మహనీయ అబూ బక్ర్ వచ్చి, "ఉమర్! ఇక చాలించు, నెమ్మదిగా కూర్చో" అన్నారు. కాని ఆయనకు ఎటువంటి స్పృహే లేనట్టుగా వ్యవహరిస్తు న్నారు.

అప్పుడు అబూ బక్ర్ అటునుంచి కాస్త తొలిగి ప్రసంగించ సాగారు. సమూహమంతా మహనీయ ఉమర్‌ని వదలి ఆయన వైపునకు మరిలారు. ఆయన ఇలా చెప్ప సాగారు.

"అవును, ఎవరయితే మహనీయ ముహమ్మద్ (స)ని పూజించే వారో వారు తెలుసుకోవాలి, ఆయనయితే పరమపదించారు. మరెవ రయితే దైవ దాసులో, దైవాన్ని ఆరాధించే వారో, వారు తెలుసు కోవాలి, దైవం నిత్య సజీవుడు, ఆయనకు మృత్యువు సోకదు. దైవం స్వయంగా తన ప్రవక్తతో అన్నాడు, 'నీవూ మరణిస్తావు, వారూ మరణించవలసిన వారే' (39: 30)అని.

ఇంకా,

"ముహమ్మద్ ఒక దైవ సందేశ హరుడు తప్ప మరేమీ కారు. ఆయనకు పూర్వం ఇంకా ఇతర దైవ సందేశహరులూ గతించారు, ఒకవేళ ఆయన మరణించినా లేదా చంపబడినా మీరు వెనుతిరిగి మరలిపోతారా? గుర్తుంచుకోండి! ఎవరు వెనుతిరిగిపోతారో వారు దైవానికి ఎటువంటి హాని కలగజేయ లేరు. అయితే కృతజ్ఞులయిన దాసులకు ఆయన దాని సద్ఫలి తాన్ని అందజేస్తాడు" (ఆలి ఇమ్రాన్ 3 : 144)

ఆయన చేసిన ఈ ప్రసంగం విని సహచర మాన్యులు రోదిస్తూ ఎక్కిళ్ళ పర్యంతం అయ్యారు. స్వయంగా మహనీయ ఉమర్ స్థితి వర్ణించ వీలులేకుండా పోయింది, తాను భ్రమలో ఉన్నానని ఆయనకు అర్థం అయింది. ఆయన ఉన్న పట్టున క్రింద పడిపోయారు. సహచరులు ఆ ఆయత్ (వచనం) విని ఈ సందర్భం కొరకే అవతరించిందా అన్నట్టుగా ఉలిక్కిపడి తేరు కున్నారు!

## అన్సారీ సహచరుల సమావేశం

మక్కా నుండి మదీనాకు హిజ్రత్ చేసిన సహచరుల్ని ఆదుకుని తోడ్పడిన మదీనా వాసులయిన ముస్లిములను అన్సారులని అంటారు. ప్రవక్త శ్రీ పరమపదించిన తరుణంలో వారు నాయ కత్వ సమస్యను చర్చించడానికి మహనీయ సఅద్ బిన్ ఉబాద గృహం వద్ద సమావేశమయ్యారు.

తాము ప్రత్యేకంగా సమావేశమవ్వాలన్న ఆలోచన అన్సారుల్లో రేకెత్తించినవారు కపట ముస్లిములు. అలా ముస్లిముల్లో

అంతర్యుద్ధం సృష్టించాలన్నది వారి ఎత్తుగడ. మహనీయ అబూ బక్ర్ ఇంకా మస్జిద్ నుండి వెళ్ళక పూర్వమే ఈ వార్త ఆయనకు తెలిసింది. ఇది అతి సున్నితమయిన సందర్భం. ఆయన మహనీయులు ఉమర్, అబూ ఉబైదా బిన్ జర్రాహ్‌ను వెంట బెట్టుకుని మహనీయ సఅద్ బిన్ ఉబాదా (బనీ సాఅదా) చావిడీలో ప్రవేశించారు.

అక్కడ మహనీయ ఉమర్(ర) ఏదో చెప్పబోయారు, మహనీయ అబూ బక్ర్ ఆయన్ని వారించారు. తాను స్వయంగా లేచి ఎంతో గంభీరంగా, గౌరవప్రదంగా, అయితే ఆత్మవిశ్వాసంతో, ఉత్తమ రీతిలో ఉపన్యసించారు. అందులో, తొలుత ముహాజిరుల కృషినీ, వారి త్యాగాలను, సేవలను ప్రస్తావించారు. ఆ పైన అన్సారుల ధార్మిక సేవలను, ఒక్కొక్క దాన్నే ప్రస్తావించారు, ప్రేమ మయ మయిన త్యాగాలను, వారి విశ్వాస పరమయిన భావోధృతిని కొనియాడారు.

## కురైషీల ప్రస్తావన

ఆ తరువాత ఆయన దైవ సందేశహరులు పలికిన ఓ సూక్తిని వినిపించారు, "నాయకులు కురైష్ (తెగ) నుంచి కావాలి" అన్నది. ఇంకా, "ఈ ప్రవక్త నిర్ణయం ప్రకారమే అమలు జరపడం అవసరం, నాయకుడు కురైష్‌లో నుంచి, మంత్రులు అన్సారు లలో నుంచి ఏర్పడాలి. అన్సారుల సలహాలు వారికి చాలా అవసరం." ఈ ప్రసంగం ముగియగానే మహనీయ హబాబ్ బిన్ ముంజిర్ అన్సారీ మాటలాడటానికి లేచారు. దానికి మహనీయ ఉమర్ సమాధానం ఇచ్చారు. ఆ తరువాత మహనీయ అబూ ఉబైదా నిలబడి, "అన్సారీ సహోదరులారా! మీరు ఇస్లామీయ వ్యవస్థను స్వీకరించడంలో, దానికి మద్దత్తు తెలు పడంలో మున్ముందు ఉన్నారు, ఇప్పుడు దాన్ని పడదోయడంలో ముందుకు రాబాకండి" అన్నారు.

ఇది విని మహనీయ బషీర్ బిన్ సఅద్ అన్సారీ నిలబడి, మదీనా అన్సారులను సంబోధించి, "సహోదరులారా! మనం ఇస్లామ్ స్వీకరించడమయినా, దైవ మార్గంలో కృషి సలపడ మయినా, ధార్మిక సేవల నందించ డమయినా కేవలం దైవం, దైవ సందేశ హరుల పట్ల విధేయతా భావంతో, దైవ ప్రసన్నత బడయటానికి చేశాము. ఇప్పుడు మనం వాటిని ప్రస్తావించి వాటి ఫలాల నాశించడం సబబేనా? మన సేవలు దైవ స్వీకృతి పొందినట్లయితే ఆయనే వాటి ఫలితాన్ని తప్పక అందజేస్తాడు. ఆయన ప్రదానం చేసే బహూకరణలు ప్రపంచంలోని ప్రతి పదార్థం కన్నా మేలయినవి!" అన్నారు. ఆ తరువాత ఆయన కురైషీల ప్రత్యేకతలు, అరేబియాలో వారి పరపతి, వారి బలాధిక్యత, తదితర విషయాలను ప్రస్తావించారు.

## ప్రమాణ స్వీకారం

ఆ తరుణంలో దాదాపు ఏకాభిప్రాయం కుదరినట్లు అగుపించింది. ఇక సముదాయానికి సరయిన మార్గదర్శనం అవసర మని భావించారు మహనీయ అబూ బక్ర్(ర). ఆనాడు సము దాయంలోని ఇద్దరు అత్యుత్తమ వ్యక్తులు కూడా ఆ సమా వేశంలో ఉన్నారు. అందువల్ల ఆయన, "ఇదో మన సము దాయంలోని ఇద్దరు ఉత్తమ పురుషులు ఇక్కడ ఉన్నారు, ఉమర్, మరి అబూ ఉబైదా. ముస్లిముల్లో వీరిని ఎరుగని వారెవరూ లేరు. వీరిరువురిలో మీరు కోరిన వారిని ఎన్నుకుని వారి చేతి మీదుగా ప్రమాణం చేయండి" అని ముగించారు.

కాని వారిరువురూ ఒకరి తరువాత మరొకరు అబూ బక్ర్(ర)ని సంబోధించి ఇలా అన్నారు,

"మీరు ముస్లిములందరిలో ఘనత గలవారు. ప్రవక్త శ్రీకి గుహ మిత్రులు, హజ్జ్‌లో ప్రవక్త (స) నియమించిన నాయకులు, నమాజ్‌లో కూడా ప్రవక్త మరీ మరీ చెప్పి మిమ్మల్నే తన స్థానంలో ఇమామ్‌గా, నాయకునిగా నియమించారు. నమాజ్ కన్నా ధర్మంలో ఘనమయినదేముంది? కనుక మీకన్నా తగిన వారెవరూ కాలేరు. మీరే ఈ బాధ్యత నిర్వహించండి" అన్నారు. చివరన మహనీయ ఉమర్, ఈ విధంగా పలుకుతూ ఆయన ముందుకు వచ్చి నిర్ధారణాగ్రేసరుని చేతి మీదుగా ప్రమాణం చేశారు.

ఆ పైన అబూ ఉబైదా, బషీర్ బిన్ సఅద్ (ర) వారిని అనుసరించారు. ఆ తరువాత తెగ నాయకులు, సాధారణ ముస్లిములు ఎగబడి ప్రమాణం చేశారు. ఆ సందర్భంలో ముస్లిమ్ సము దాయం ఓ మహా సంక్షోభం నుండి బయట పడగలిగింది. పరస్పర విభేదాల సంకట పరిస్థితి నుండి తేరుకోగలిగింది.


ఆ సందర్భాన్ని ప్రస్తావిస్తూ హబాబ్ బిన్ ముంజిర్ ఇలా ఉటంకించారు, 'అన్సారీలు నా మాటకు ప్రాముఖ్యత నిచ్చేవారు, నేనే ఈ సమస్యకు పరిష్కారం చూపగలనని అనిపించింది. కాని దానివల్ల సమావేశంలో గలభా పెరిగింది. విభేదాలు పెచ్చరిల్లుతా యన్న ప్రమాదం ఏర్పడింది. నేను వెంటనే, "అబూ బక్ర్! మీ చెయ్యిని చాపండి" అని చెప్పి, ఆయన చెయ్యి చాపగానే నేను ఆయన చేతి మీదుగా ప్రమాణం చేశాను. ఆ పైన ముహాజిరులూ అన్సారీలూ ప్రమాణం చేశారు.

ఆ మరుసటి రోజు సాయంత్రం ప్రవక్త మస్జిద్‌లో గత రాత్రి జరిగిన చర్చల వివరాలను తెలుసుకుని ముస్లిములందరు సర్వ సామాన్య ప్రమాణ సభ జరుపుకున్నారు. ❑

# నీ ఓటు ఎవరికీ? ధర్మాన్ని నమ్మేవాడు

# అధర్మంగా ఓటు వేయడు

**- సమీనా సలీమ్**




సిరా చుక్క మౌనం పాటిస్తే సారా చుక్క రాజ్యమేలుతుంది ఓటర్ మౌనం పాటిస్తే ప్రజాస్వామ్యమే కుప్పకూలుతుంది!

నిద్రావస్థలో ఓటరు ఉంటే దేశం కాదు నేతలు అభివృద్ధిలో వుంటారు

మరి పోలింగ్ సమయంలో ఒక పెద్దాయన పోలింగ్ బూత్‌లో ఓటు వేసి బయటకు వస్తూ పోలింగ్ ఏజెంట్‌ని అడిగాడు - మా ఆవిడ వచ్చి ఓటు వేసి వెళ్లిపోయిందా అని.

పోలింగ్ ఏజెంట్ లిస్ట్‌లో పేరు చెక్ చేసి ఇలా అన్నాడు : అహ్! కొద్దిసేపటి క్రితం వరకూ ఆవిడ ఇక్కడే ఉంది. ఓటు వేసి ఇపుడే వెళ్ళిపోయింది!

**పెద్దాయన :** చాలా విచారంగా మొహం పెట్టి నేను కొంచెం ముందు వచ్చి ఉంటే బాగుండేది. ఆవిడని కలిసి వుండే వాడిని అని అన్నాడు!

**ఏజెంట్:** ఏమి సార్! ఆంటీ, మీరు ఒక దగ్గర కలిసి ఉండటం లేదా అని అన్నాడు!

**పెద్దాయన:** మా ఆవిడ చనిపోయి 15 సంవత్సరాలు అయింది! కాని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఓటు వేసి వెళ్ళి పోతుంది అన్నాడు.

ఇది మన ఎన్నికల విధానంలో గల లోపం అని అనేముందు గత ఎన్నికల్లో ఓటర్ల ఆలోచనలను ఆచరణను అనుభవాలను ఒక్కసారి పరిశీలిద్దాం!




సాయంత్రం నాలుగైంది. ఎండ కాసింత తగ్గింది. ఇంటి పనులతో సతమతమవుతున్న ఒక్కొక్కరే ఇంట్లోంచి బయటకు రావడం ప్రారంభమైంది. పోలింగ్ బూత్‌ల ముందు లైన్లు మెల్లిమెల్లిగా పెరగడం ప్రారంభమైంది. క్యూలో చేరుతున్న మహిళల సంఖ్య మెల్లిమెల్లిగా పెరుగుతోంది. సాయంత్రం ఆరయింది. ఓటు వేసేందుకు మహిళలు భారీ సంఖ్యలో వచ్చారు. వారంతా రాత్రి ఎనిమిది గంటలైనా క్యూలో నుంచి కదల్లేదు... మెదల్లేదు లైన్‌లో చివరి వరకు ఉన్న మహిళలు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇలా పట్టుదలగా ఓట్లు వేసిన మహిళలు ఎవరికి జై కొట్టారో మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు. మొత్తం తెలుగు వారు ఉన్న అన్ని ప్రాంతాల్లోనూ చర్చనీయాంశమైంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఓటింగ్ శాతం విపరీతంగా పెరిగింది. దీనికి కారణం మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.పోలింగ్ బూత్ ముందు క్యూలో నిలబడి ఓట్లు వేసిన మహిళలు తాము ఎవరి పక్కన ఉన్నామో మాత్రం పెదవి విప్పలేదు. ఆడువారి మాటలకే కాదు చేతలకీ కూడా అర్థాలు వెతకడం అంత సులభం కాదు అని నిరూపించారు.

గతంలో మహిళలు తాము ఎవరికి ఓటు వేసామో బహిరంగంగాను, బాహాటంగానూ చెప్పేవారు. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి వేస్తే ఆ విషయాన్ని మహిళలు నిస్సంకోచంగా వెల్లడించేవారంటున్నారు. ఈసారి అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదంటున్నారు.

ఇక తెలుగు రాష్ట్రాల్లోనూ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడైందని సీఎంఎస్ తెలిపింది. తెలంగాణలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు కలిపి మొత్తం రూ.5450కోట్లు ఖర్చయినట్టు వెల్లడించింది. అదే ఏపీలో ఎన్నికల ఖర్చు రూ.10వేల కోట్లు దాటిందని తెలిపింది. దేశంలోని నియోజకవర్గాలన్నింటిలో అత్యంత ఎక్కువ ధనప్రవాహం జరిగిన నియోజకవర్గాల జాబితాను కూడా సీఎంఎస్ వెల్లడించింది. అందులో మొత్తం 40 నియోజక వర్గాలు ఉండగా.. తెలుగు రాష్ట్రాల నుంచి కడప, అనంతపురం, విశాఖపట్నం, విజయవాడ, నల్గొండ, గుంటూరు, చేవెళ్ల, మల్కాజ్‌గిరి ఉన్నాయి. ఏపీలో సగటున ఒక్కో ఓటుకు రూ.2వేల వరకు పార్టీలు ఖర్చు చేసినట్టు తెలిపింది. గుడివాడ నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేస్తే.. మరో ప్రాంతంలో రూ.7వేలు వరకు పంపిణీ చేసినట్టు సీఎంఎస్ పేర్కొంది.

ఎన్నికలంటేనే ఖరీదైనవిగా మార్చేశాయి పార్టీలు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే కోరికతో.. విచ్చల విడిగా ప్రలోభాలకు తెర లేపుతున్నారు అభ్యర్థులు. డబ్బు, మద్యంతో పాటు.. కుక్కర్లు, చీరలు, గోడ గడియారాలను పంచుతున్నారు. కొన్ని చోట్ల మత్తు పదార్థాలను కూడా సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసుల తనిఖీల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. ఇంకొంతమంది తాయిలాల కోసం కొత్త దారులు వెతుకుతున్నారు. ఈసీ కళ్లు కప్పేందుకు.. డిజిటల్ పేమెంట్స్, షాపింగ్ మాల్స్ ద్వారా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న ఎన్నికలు.. దేశంలోనే ఖరీదైనవిగా మారిపోయాయి. ఎన్నికల కోసం..ఒక్కో అభ్యర్థి.. 50 నుంచి 100 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.


### తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతం

2014లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 69.5 శాతం పోలింగ్ నమోదైంది. 2018లో 73.2 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓట్లు వేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పోలింగ్ నమోదు అయింది. పట్టణ ప్రాంతాల్లో తక్కువగా ఓట్లు నమోదు అయ్యాయి.

**2018 తెలంగాణ ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లు:** నోటా.. ప్రతి ఓటరుకు ఉన్న ఆయుధం. ఎన్నికల్లో నిల్చున్న అభ్యర్థి నచ్చకపోతే ఓటరు నోటాను ఎంచుకుంటారు. అది ఓటర్ల చేతిలో ఉన్న చాలా పవర్ ఫుల్ ఆయుధం. ఎన్నికల్లో నిల్చున్న అభ్యర్థుల తలరాతను తలకిందులుగా చేసే పాశుపతాస్త్రం. క్రితంసారి జరిగిన ఎన్నికల్లో 70








చోట్ల అయిదులోపు స్థానంతో నోటా సంచలనం రేపింది. మరోవైపు ఆరుగురి అభ్యర్థుల తలరాతను తలకిందులు చేసేసింది.

ఓటు ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో అని ఎన్నికల ప్రచార వేదికలను పరిశీలిస్తే ఈసారి కొత్త ట్రెండ్ కనబడుతుంది. గులాబీల జంటలే పాటకు స్టెప్పులేసిన నాయకులు. అప్పుడెట్లుండె తెలంగాణ.. ఇప్పుడెట్లయింది తెలంగాణ అని వీడియోలు పోస్ట్ చేస్తున్నారు

మరి అప్పుడు ఎన్ని మద్యం దుకాణాలు ఉండేవి, ఇప్పుడు ఎన్ని వున్నాయి అని కూడా చూపిస్తే బాగుండేది.

కాంగ్రెస్ వాగ్దానాలు ఆచరణ సాధ్యమేనా? ఉచితాలతో అభివృద్ధి సాధ్యమా?

## మేనిఫెస్టోలోని కీలక హామీలు..

### బీఆర్ఎస్

✤ సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ. 3 వేల గౌరవ వేతనం
✤ దివ్యాంగుల పెన్షన్లు రూ.6 వేలకు పెంపు
✤ ఆసరా పెన్షన్లు రూ.5 వేలకు పెంపు
✤ రైతుబంధు కింద ఇస్తున్న రూ.10 వేల నగదు సాయాన్ని 16 వేలకు పెంపు (అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో రూ.12 వేలు.. ఆ తర్వాత క్రమంగా పెంపు)
✤ బీసీలకు అమలు చేస్తున్న పథకాలు అలాగే కొనసాగింపు
✤ దళితబంధు పథకం యథావిధిగా కొనసాగింపు
✤ గిరిజనేతరులకు కూడా పోడు భూములు ఇచ్చే అంశం పరిశీలిస్తాం.
✤ ఆరోగ్యశ్రీ పథకం రూ. 15 లక్షల పెంపు
✤ అర్హులైన వారందరికీ రూ. 400కే సిలిండర్, అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు కూడా రూ. 400కే సిలిండర్
✤ తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్న బియ్యం
✤ 'కేసీఆర్ బీమా ప్రతి ఇంటింటి ధీమా' పేరుతో రూ.5 లక్షల బీమా పథకం (93 లక్షల మందికి లబ్ధి)
✤ హైదరాబాద్‌లో మరో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు
✤ ప్రభుత్వ ఉద్యోగుల ఓపీఎస్ డిమాండ్‌పై కమిటీ ఏర్పాటు
✤ లంబాడీ తండాలు, గోండు గూడేలను పంచాయతీలను చేస్తాం.
✤ అసైన్డ్ భూములు కలిగి ఉన్నవారికి భూ హక్కులు
✤ ఇంటి స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు

### కాంగ్రెస్ పార్టీ పీపుల్స్ మేనిఫెస్టో ముఖ్యాంశాలు

➢ 100 శాతం అక్షరాస్యత సాధించే దిశగా కార్యాచరణ.
➢ రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా. దీని పరిధిలోకి అన్ని రకాల వ్యాధులు.
➢ ఎర్రగడ్డ ఛాతీ ఆస్పత్రిలో 1000 పడకల వైద్యశాల.

- సొంత స్థలం ఉంటే ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం.
- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్.
- రైతులకు ఒకే దఫా రూ.2 లక్షల రుణమాఫీ.
- పంటలకు మద్దతు ధర.
- రూ. 5000 కోట్లతో ధరల స్థిరీకరణ.
- ఉస్మానియా ఆస్పత్రి భవనానికి వారసత్వ సంపదగా గుర్తింపు.
- ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్.
- నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3000 భృతి.
- విద్యార్థులందరికీ బోధనా రుసుం చెల్లింపు.
- పాలనలో జవాబుదారీతనం.
- ఉద్యమకారులపై కేసులు ఎత్తివేత

## సమస్యాత్మక ప్రాంతాలపై తీసుకునే చర్యలివే..

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ల సమాచారాన్ని కమాండింగ్ అధికారులకు ఎలక్షన్ కమిషన్ అందించింది. ఎప్పటికప్పుడు కమాండింగ్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించనున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్ కాస్టింగ్ సిస్టంను ఏర్పాటు చేయనున్నారు. కనీసం 50% ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్ పూర్తిగా జరిపేలా ఏర్పాట్లు చేయనున్నారు. సమస్యాత్మక ప్రాంతాల పోలింగ్ బూత్‌ల వద్ద ఏవైనా గొడవలు జరిగిన వెంటనే సంబంధిత ఫుటేజ్‌ను తిలకించే విధంగా వీడియోగ్రఫీ కూడా చేయనున్నారు. ప్రతీచోట మైక్రో అబ్జర్వర్‌ను పోలింగ్ బూత్‌లో ఉంచనున్నారు. ఇలా ఎన్నికల సంఘం సమస్యాత్మకం నుంచి అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టింది.

ఓటింగ్ అనేది కేవలం హక్కు కాదు; ఇది మనకు, భవిష్యత్ తరాలకు మనం రుణపడి ఉన్న బాధ్యత. ప్రతి ఓటు పటిష్ట ప్రజాస్వామ్యానికి బిల్డింగ్ బ్లాక్. మీ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా, మీ సంఘం, దేశ దశ దిశ నిర్మాతలవుతారు. వార్తలపై శ్రద్ధ వహించండి, అభ్యర్థుల ప్లాట్‌ఫారమ్‌లను అర్థం చేసుకోండి, చర్చలలో పాల్గొనండి. స్పృహతో కూడిన ఓటరుగా ఉండండి, వినికిడి కంటే వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోండి. ✤

# కొత్త తునకలు-4

**- ఎస్.ఎమ్. మలిక్**

13) ఉదయం, అస్తమయం సుదూర పార్శ్వాలు
పూర్వం పశ్చిమం!
ఒకదాన్ని స్పర్శిస్తే మరొకటి దృష్టికే ఆనదు
ఆవేశం, ఆచరణం!!

14) నడి సంద్రంలో చుక్కాని లేని నావ -
చీకటి పయనం!
మసక వెల్తురులో ఇంటి ముఖం కన్నా
గమ్యమే నయం!!

15) ఇక మిగిలిందేమిటీ, భిన్నమయిన కొన్ని కలలు
కొన్ని గుండె ముక్కలు
కొత్త కోట ఒకటి కట్టుకుంటాను, నివసించేందుకు
తోడెవరయినా వస్తారా?

16) రాలిపోతున్న ఆకుల రంగు చూసి
గుండె తరుక్కుపోతోంది నేడు!
చూడగలిగే అవకాశం ఎన్నడయినా
నాకు లభిస్తుందా - పూలను?

17) ఆశలు ఆశయాలు ఆవేశాలు ఆవేదనలు
తికమక పడతాయి నాలోనే!
పరస్పరం ఘర్షణకు దిగవు, హానికరం!!
ఆత్మజ్ఞానం గుణాలకే అధికం!!!

18) సముద్రం ఘోషిస్తుంది ప్రతి రాత్రి
చంద్రునికి ప్రేమ పాటలు వినిపించే
తరంగాల లయల మధ్య : ఆనందం
ఇహలోకంలో తాత్కాలికం అని!

19) ఇక పదాలన్నీ ముగిశాయి, పూలే మిగిలాయి
ఎంతకాలమని ఈ పదాల పోరు?
మనసుకు నెమ్మది కరవయి, విలవిల్లాడుతోంది
చిటికెడు నెమ్మది అరువు ఇద్దామా??

20) మనిషి గమ్యహీనంగా జీవించి నశించడం కాదు
ఉన్నత మానవీయ స్థానాల నధిరోహించాలి...
ఆచరణ స్వేచ్ఛ ఉంది, దైవదూతలనూ మించాలి
మానవ గమ్యం మృత్యువు కాదు అమరత్వం!





# మానవులంతా ఒక్కటే ... దేవుడు ఒక్కడే

**జమాఅతె ఇస్లామీ హింద్** జాతీయ ఉపాధ్యక్షులు, **ప్రొఫెసర్ ముహమ్మద్ సలీం ఇంజనీర్** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన సర్వధర్మ సమ్మేళనంలో పాల్గొని ఇస్లాం ధర్మాన్ని, ధార్మిక విశ్వాసాలను పరిచయం చేశారు. **"సబ్ కా మాలిక్ ఏక్"** (అందరి దేవుడు ఒక్కడే) అనే థీమ్‌తో బ్రహ్మ కుమారీస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ మతాలకు చెందిన మత పెద్దలు ప్రసంగించారు. చివరికి భారత రాష్ట్రపతి శ్రీమతి. ద్రౌపది ముర్ము అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో జమాఅత్ అధ్యక్షుడితో పాటు జాతీయ కార్యదర్శి రహ్మతున్నిసా, సహాయ కార్యదర్శులు వారిస్ హుస్సేన్, డాక్టర్ ఇక్బాల్ సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సలీం ఇంజనీర్ చేసిన ప్రసంగాన్ని యథాతథంగా పాఠకుల కోసం అందిస్తున్నాము.

## ప్రొ. సలీమ్ ప్రసంగం:

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన సృష్టికర్త పేరుతో ...

ఆ పరమప్రభువే యావత్తు విశ్వాన్ని సృష్టించాడు. ఆయనే మనందరిని పుట్టించినవాడు, పోషిస్తున్నవాడు. సర్వస్తోత్రాలు ఆయనకే. ఆయన అన్నీ తెలిసినవాడు, సర్వశక్తిమంతుడు. ఆయన అత్యంత దయామయుడు, కృపాశీలుడు. ఆయన మనకు చాలా సన్నిహితంగా ఉన్నాడు. దగ్గరగా ఉన్నాడు. మన మాటలు వింటాడు. జవాబు ఇస్తాడు. మన మనోమస్తిష్కాల్లోని ఆలోచనలన్నీ తెలిసినవాడు. మన సంకల్పాలు, మన ఉద్దేశ్యాలు అన్నీ కూలంకషంగా తెలిసినవాడు. ఒక రోజు మనమందరం ఆ పరమప్రభువు సమక్షంలో హాజరై, మన పూర్తి జీవితం గురించి, ఆ విశ్వప్రభువు మనకు ప్రసాదించిన ఒక్కొక్క అనుగ్రహం గురించి, మన ప్రతి ఆచరణ గురించి లెక్క చెప్పుకోవలసి ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. ఈ ప్రపంచంలో మానవాళికి దైవసందేశాన్ని, హితవులను, మార్గదర్శకత్వాన్ని అందించడానికి పంపించబడిన ప్రవక్తలందరిపై ప్రభువు శాంతికారుణ్యాలు వర్షించాలని వేడుకుంటున్నాను.

మాననీయులైన రాష్ట్రపతి గారు, ఈ రోజు ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పరమపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీ విశ్వవిద్యాలయ పదాధికారులైన సోదరీ మణులకు, సోదరులకు, వేదికపై ఉన్న గౌరవనీయులైన మతపెద్దలు, ధార్మికగురువులకు, ఈ సభాప్రాంగణంలో హాజరైన సోదరసోదరీమణులకు, రాష్ట్రపతి భవన్ అధికారులకు అందరికీ నా సలాములు. పరమప్రభువు కరుణాకటాక్షాలు అందరిపై ప్రసరించాలని వేడుకుంటున్నాను. ఈ అద్భుతమైన కార్యక్రమంలో పాల్గొనడం నాకు చాలా గర్వంగా ఉంది. నేను విశ్వప్రభువకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

ప్రపంచంలోని మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతానమని, అంటే ఆదం హవ్వాల సంతానమని అందరూ విశ్వసిస్తారు.

మనందరిలోను ఒకే తల్లిదండ్రుల రక్తం ప్రవహిస్తోంది. విశ్వ ప్రభువు పంపించిన దైవప్రవక్తలు, చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స) విశ్వప్రభువు సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. మానవు లంతా ఒక్కటే అని చాటి చెప్పారు. ఎవరు గొప్పవాడు కాదు, ఎవరూ హీనుడు కాదు, ఎవరు పెద్దవాడు కాదు, ఎవరు చిన్నవాడు కాదు. ప్రతి మనిషికి గౌరవమర్యాదలు లభించాలి. ప్రతి మనిషి గౌరవమర్యాదలకు రక్షణ ఉండాలి. మతం, జాతి, ఆలోచనాపంథా, ప్రాంతం, స్త్రీపురుష భేదం– ఇలా ఏవిధంగా నైనా సరే, ఏ ప్రాతిపదికనైనా సరే ఎవరి హక్కులూ తక్కువ కాదు, ఎవరి హక్కులూ ఎక్కువ కాదు. ఎవరి పట్లా వివక్ష, పక్షపాతాలు ఉండరాదు. అలాంటి వాతావరణం ఏర్పడేలా సమాజం, సామాజిక వ్యవస్థ పని చేయాలి. ప్రవక్త ముహమ్మద్ (స) ఏమన్నారంటే, **"అల్ ఖల్కు అయాలిల్లాహ్"** అంటే ఈ సృష్టిమొత్తం ఆ పరమప్రభువు కుటుంబం, ఆయన పరివారం. అలాగే వసుధైక కుటుంబకం భావన మనకు తెలిసిందే. మన దేశ సాంస్కృతిక పునాదులను నిర్వచించే వాక్యమిది. ప్రపంచంలో విశ్వప్రభువు సృష్టించిన అత్యుత్తమ సృష్టి మనిషి. ప్రపంచంలో మనిషి విశ్వప్రభువుకు ప్రతినిధి. మన భారత సమాజం వైవిధ్యభరితమైనది. మన దేశంలోని ప్రజలు ఏదో ఒక మతాన్ని విశ్వసిస్తుంటారు. దేశంలోని ప్రజలు తమకు నచ్చిన మతాన్ని అవలంబించి ఆచరించే స్వేచ్ఛ కలిగి ఉన్నారని సంవిధానం ప్రకటించింది.

మతం మనుషులను కలుపుతుంది. మనుషుల్లో విభేదాలను సృష్టించేది, మనుషుల్లో నిమ్నోన్నతలు కల్పించేది మతమే కాదు. సమాజంలో విద్వేషం, హింస, ప్రజల్లో అవిశ్వాసం, అపనమ్మకం ఇవన్నీ ధర్మపరాయణుల వల్ల వ్యాపిస్తున్నవి కావు. ధర్మాన్ని, మతాన్ని దుర్వినియోగపరిచే కొన్ని స్వార్థశక్తులు, సంఘవిద్రోహ శక్తులే దీనికి కారణం. నేను ఇస్లామ్ ధర్మాన్ని నమ్ముతున్నాను. ఇస్లామ్ ధర్మానికి ప్రతినిధిగా ఇక్కడ హాజరయ్యాను. ఈ సందర్భంగా నేను మీకు ఇస్లామ్ అంటే అర్థం విశ్వప్రభువుకు సంపూర్ణ విధేయత చూపించడమని నివేదిస్తున్నాను. ఇస్లామ్‌కు మరో అర్థం శాంతి. సృష్టికర్తకు సంపూర్ణ విధేయత చూపించడం ద్వారానే మనిషికి శాంతి లభిస్తుంది. సమాజంలో శాంతి న్యాయాలు స్థాపించబడతాయి. న్యాయాన్ని స్థాపించడమే నిజానికి ధర్మాన్ని స్థాపించడం. ఇదే శాంతిని స్థాపించడానికి అసలు పునాది. మతం మనకు మన సృష్టికర్తను పరిచయం చేస్తుంది. సృష్టికర్తతో మనిషిని అనుసంధానిస్తుంది. నిజమైన



ధార్మికవ్యక్తి విశ్వప్రభువును ప్రేమిస్తాడు. తోటి మనుషులను ప్రేమిస్తాడు, తోటివారి పట్ల గౌరవమర్యాదలతో వ్యవహరిస్తాడు. సమాజానికి సేవలందిస్తాడు. మతం మనిషికి క్రమశిక్షణ నేర్పుతుంది. అన్యాయాలు, దౌర్జన్యాల వల్ల బాధితులైన వారు, వారు ఏ మతానికి చెందినవారైనా, ఆ బాధితుల పక్షాన నిలబడాలని ధర్మం కోరుతుంది. బాధితులకు సహాయం చేయాలని, వారికి అవసరమైన సేవలందించాలని, సమాజంలో వారికి తగిన స్థానం లభించేలా ప్రయత్నించాలని ధర్మం ప్రబోధిస్తుంది.

విభిన్న ధర్మాలను అవలంబిస్తున్న ధార్మికులు, ధర్మగురువులు, మతపెద్దల్లో స్నేహసంబంధాలు పటిష్టం కావలసిన అవసరం నేడు ఉంది. వారి మధ్య చర్చలు జరుగుతూ ఉండాలి. సమాజంలో నైతిక ప్రమాణాలను పెంపొందించడానికి ధార్మిక గురువులందరు కలిసి ప్రయత్నించాలి. ధర్మగురువులందరు ఈ విషయమై ముందుకు వచ్చి, ఈ పనికి నడుంకట్టి, అందరూ కలిసి సమాజంలో చైతన్యం సృష్టించడానికి, సద్భావన, పరస్పర నమ్మకాలను పటిష్టం చేసే పవిత్రమైన కార్యాచరణకు పూనుకోవాలని నేను పిలుపునిస్తున్నాను. మనం ఈ పని చేస్తూనే ఉన్నాము. ఇంకా చురుకుగా ఈ పనులు జరగవలసి ఉంది. మనందరికీ దేశం పట్ల, సమాజం పట్ల మన బాధ్యతలు నిర్వర్తించే ప్రేరణ, శక్తి ప్రసాదించాలని నేను సర్వలోక ప్రభువును వేడుకుంటున్నాను. ఆ విధంగా మనం అందరం కలిసి శాంతిప్రధానమైన, నైతిక ప్రమాణాల ప్రధానమైన, న్యాయప్రధానమైన సమాజాన్ని నిర్మించగలగాలి. భారతదేశాన్ని ప్రగతి, సౌభాగ్యాల బాటన ముందుకు తీసుకువెళ్ళగలగాలి. విశ్వప్రభువు స్తోత్రాలతో, ఆదరణీయులైన రాష్ట్రపతి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ధన్యవాదాలు. ✤




# ఫేక్ న్యూస్ రౌండప్

పశ్చిమాసియా యుద్ధంలో ఇస్రాయిల్‌కు అనుకూలంగా ఫేక్ వార్తలు విస్తృతంగా ప్రచారంలోకి వస్తున్నాయి. అలాంటి ఒక ఫేక్ వార్తలో గాజాలో చనిపోయిన వ్యక్తి తన కళ్ళు తెరిచినట్లు చూపించే ఒక వైరల్ వీడియో వచ్చింది. ఇది ఫేక్ వార్తగా తర్వాత నిర్ధారణ అయ్యింది. కాని అప్పటికే ఈ ఫేక్ వార్త సోషల్ మీడియాలో చాలా మంది షేర్ చేశారు. చాలా మంది ఈ వార్తను నమ్మేసి పాలస్తీనాలో మరణాలన్నీ కేవలం ఫేక్ మరణాలనే అభిప్రాయానికి వచ్చేసి ఉంటారు. అసలు ఈ వీడియో గాజకు చెందినది కాదు. ఈ వీడియో వాస్తవానికి మలేషియాకు సంబంధించింది. అక్కడ అంత్యక్రియలు ఎలా చేయాలనే శిక్షణకు సంబంధించిన వీడియో ఇది. మలేషియాలోని బందర్ దిరాజా క్లాంగ్ అధికారిక మసీదులో జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు అంత్యక్రియల ప్రక్రియ ఎలా ఉంటుందో చూపించడానికి శవాలుగా వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్-గాజా యుద్ధానికి సంబంధించినది కాదు. ఆల్ట్ న్యూస్ ఈ వాస్తవాన్ని బట్టబయలు చేసింది. మలేషియా వీడియోను గాజా వీడియోగా తప్పుదారి పట్టించే శీర్షికలతో షేర్ చేశారు. ఇలాంటి ఫేక్ వార్తలతో ఇస్రాయిల్ క్రూర యుద్ధానికి మద్దతు సంపాదించుకుంటున్నారు.

మరో ఫేక్ వార్త చూద్దాం భారత రాజకీయాల్లో యువ సంచలనం కన్హయ్య కుమార్‌కు సంబంధించిన ఒక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ప్రజలు ఇస్లాంను స్వీకరించాలని ఆయన చెబుతున్నట్లు ఈ వీడియోలో చిత్రీకరించారు. సెప్టెంబరు 28 నుంచి ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. నిజానికి కన్హయ్య కుమార్ మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో చేసిన సుదీర్ఘ ప్రసంగంలో చిన్న ముక్క ఇది. ఆల్ ఇండియా తంజీమ్-ఇ-ఇన్సాఫ్ నిర్వహించిన కార్యక్రమం అది. అసలు ప్రసంగంలో, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి కూడా ప్రస్తావించారు. ఆ ప్రసంగంలో ఆయనెక్కడ కూడా ఇస్లాం స్వీకరించాలని ప్రజలను కోరడం జరగలేదు. కాని వైరల్ క్లిప్పులో అలా చెప్పినట్లు ఎడిటింగ్ మాయాజాలం ప్రదర్శించారు. దీనివల్ల సాధించిందేమిటంటే, కన్హయ్య కుమార్ లేదా కాంగ్రెస్ నేతలు లేదా ఇండియా కూటమి నేతలు కేవలం ఇస్లాం కోసం ముస్లిముల కోసం మాత్రమే ఆలోచిస్తారు, పనిచేస్తారు, హిందువులను నాశనం చేస్తారనే అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించడం. ఇలాంటి అభిప్రాయాలు ప్రజల్లో కలిగించడం వల్ల ఏ పార్టీకి లాభం కలుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది ఫేక్ వార్తగా నిజనిర్ధారణ మీడియా సంస్థలు చెప్పే లోపుగానే ఈ అబద్ధం ప్రపంచాన్ని చుట్టి వచ్చేస్తుంది. చాలా మంది గుడ్డిగా నమ్మేసి అనేకమందికి పంచుతూ పోతుంటారు. ఫేక్ వార్తల ఫ్యాక్టరి కొనసాగుతూ ఉంటుంది.

ఇంకో ఫేక్ వార్త చూద్దాం, అమెరికా అధ్యక్షుడిని ఒక కార్యక్రమంలో అసభ్యంగా దూషించారన్నట్లు ఒక వీడియో ప్రచారంలోకి వచ్చింది. ఒక కార్యక్రమంలో జరిగిన ప్రసంగంలో అధ్యక్షుడు జో బిడెన్‌కు వ్యతిరేకంగా ప్రజలు అసభ్య పదజాలంతో దూషించారన్నట్లు చూపించారు. నిజానికి ఈ వీడియో జూలై

2022 నాటిది. అసలు వీడియోలో అలాంటి అసభ్య పదాలు లేవని బూమ్ వార్తాసంస్థ స్పష్టం చేసింది. టైమ్స్ ఆఫ్ ఇండియా అధికారిక యూట్యూబ్ ఛానెల్ కూడా సెప్టెంబర్ 24న ఈ వార్తను ప్రచారంలో పెట్టింది. వాస్తవానికి జరిగిన సంఘటన ఏమిటంటే, జో బైడెన్ మాట్లాడుతున్నప్పుడు ఫ్లోరిడాలోని పార్క్‌ల్యాండ్‌లో పాఠశాల కాల్పుల్లో బాధితురాలి తండ్రి మాన్యువల్ ఆలివర్ అధ్యక్షుడి ప్రసంగాన్ని అడ్డుకున్నాడు. తుపాకీ భద్రతా చట్టంపై తన అభ్యంతరాలు చెప్పాడు. ఆయన ఎలాంటి అసభ్యమైన పదజాలం వాడలేదు.

మరో ఫేక్ వార్త చూద్దాం, అక్టోబరు 29వ తేదీన కేరళలోని కలమస్సేరిలో జరిగిన యెహోవాసాక్షుల మతసదస్సులో వరుస పేలుళ్ళు జరిగాయి. ఈ పేలుళ్ళలో ముగ్గురు మరణించారు, 50 మందికి పైగా గాయపడ్డారు. అసలు నేరస్థుడు, 48 ఏళ్ల డొమినిక్ మార్టిన్, అతను కూడా యోహోవా సాక్షులు సముదాయానికి చెందినవాడే. ఈ పేలుళ్ళకు బాధ్యత వహిస్తూ స్వయంగా పోలీసులకు లొంగిపోయాడు. తాను ఈ పేలుళ్లకు ఎందుకు పాల్పడ్డాడో వివరిస్తూ సోషల్ మీడియాలో వీడియోను విడుదల చేశాడు. కాని మార్టిన్ లొంగిపోక ముందు ఫేక్ వార్తలు వీరవిహారం చేశాయి. మతవిద్వేష శక్తులు రెచ్చిపోయాయి. ముఖ్యంగా ముస్లిం విద్వేష శక్తులకు చేతినిండా పని దొరికింది. ఇస్రాయిల్‌కు అనుకూలంగా పోస్టులు పెట్టారు. యూదుల సమావేశంపై ముస్లిములు చేసిన దాడిగా చిత్రీకరించిన ఫేక్ వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దేశంలో ఏం జరిగినా వెంటనే ముస్లిములతో ముడేసి ప్రచారం చేయడం ఫేక్ వార్తల ఫాక్టరీ చేస్తున్న నిత్యకృత్యం అని మరోసారి రుజువైంది. పేలుళ్లను ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో ముడిపెట్టి ప్రచారం చేశారు. నిజానికి క్రయిస్తవుల్లో యెహోవా సాక్షులు త్రిత్వ సిద్ధాంతాన్ని విశ్వసించరు. జియోనిజం పట్ల తటస్థ వైఖరి కలిగి ఉన్నారు. కేరళ కలమస్సేరి జనాభాలో యూదులు చాలా తక్కువ. డొమినిక్ మార్టిన్‌పై UAPA, పేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ వంటి వివిధ చట్టాల కింద అభియోగాలు మోపబడ్డాయి. అతను దుబాయ్‌లో ఉండేవాడు, పేలుళ్లకు రెండు నెలల ముందు భారతదేశానికి తిరిగి వచ్చాడు. అతను పాల్పడిన పేలుళ్ళకు ముస్లిములకు సంబంధమే లేదు. అయినా ఇదంతా ముస్లిములు చేసిందిగా ఫేక్ వార్తలు ప్రచారంలో పెట్టారు.

## మధ్యప్రదేశ్ ఎన్నికల్లో విద్వేష ప్రసంగాలదే రాజ్యం

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజు సమీపిస్తోంది. మరోవైపు మధ్యప్రదేశ్‌లో విద్వేష ప్రసంగాలు పెచ్చరిల్లిపోయాయి. ఈ పరిస్థితిపై సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ ప్రచురించిన ఒక కథనం, భారత రాజకీయాల్లో ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ రాజకీయాలు ఎలా ఉన్నాయో స్పష్టంగా చూపిస్తుంది. మత విభజన, మతరాజకీయాలతో ప్రయోజనం పొందే ప్రయత్నాలు పరిచయం చేస్తుంది. మధ్యప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు ఎలాంటి మాటలు వినిపిస్తున్నాయంటే, ఇండోర్ మాజీ మేయర్, బీజేపీ ఎమ్మెల్యే మాలినీ గౌర్ విలేకరుల సమావేశంలో వివాదాస్పద ప్రకటన చేసింది. తన నియోజకవర్గంలో ముస్లిం సమాజం భయాలను తొలగించడానికి ఏం చేస్తారని అడిగినప్పుడు ఆమె జవాబిస్తూ, 'వందే మాతరం' లేదా 'భారత్ మాతా కీ జై' అని పలకని వారి ఓట్లు తనకు అవసరం లేదని చెప్పింది. అడిగిన ప్రశ్నకు, చెప్పిన జవాబుకు సంబంధమే లేదు. ఇది స్పష్టమైన మతతత్వ వైఖరి. మధ్యప్రదేశ్‌లో బీజేపీ మాత్రమే కాదు కాంగ్రెసు కూడా మతరాజకీయాలు పెద్దస్థాయిలో చేస్తోంది. బాలాఘాట్‌లో ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో జరిగిన కవాతు కార్యక్రమాన్ని కాంగ్రెసు నాయకుడు మెచ్చుకున్నాడు. కాంగ్రెస్ నాయకుడు మధు భగత్ అందులో పాల్గొన్నాడు. జాతీయస్థాయిలో రాహుల్ గాంధీ ఆరెస్సెస్‌పై పోరాడుతున్న హీరోగా పరిచయం అవుతుంటే, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు మత రాజకీయాల్లో మునిగి తేలుతోంది. రాజకీయ ప్రయోజనాల విషయంలో సిద్ధాంతపరమైన కట్టుబాట్లు ఏవీ పనిచేయవని రుజువు చేస్తున్నారు. ఛత్తర్‌పూర్‌లోని భాగేశ్వర్ ధామ్‌లో ధీరేంద్ర శాస్త్రి మైనారిటీలపై విద్వేషాన్ని రెచ్చగొడుతూ, వారి పట్ల ప్రజల్లో భయసందేహాలు ప్రచారం చేస్తు ప్రసంగిస్తున్నాడు. హిందూ నాయకులకు మద్దతివ్వాలని ప్రజలను కోరాడు. 'లవ్ జిహాద్' గగ్గోలు మళ్ళీ వినిపిస్తోంది. ధీరేంద్రశాస్త్రి లవ్ జిహాద్ సాకుతో ముస్లిం సమాజంపై హిందువులను రెచ్చగొడుతున్నాడు. కాంగ్రెస్ నాయకుడు కమల్‌నాథ్ ఈ స్వామీజీకి ప్రణమిల్లుతున్నాడు. బేతుల్‌లో రాష్ట్రీయ హిందూ సేనతో సంబంధం ఉన్న గోసంరక్షకులు, ముస్లిం ట్రక్కు డ్రైవర్లను వేధిస్తున్న ఒక వీడియో వచ్చింది. ఎన్నికలకు ముందు ప్రజలను రెచ్చగొట్టే విద్వేషపూరిత ప్రసంగాలు, చర్యలు, వీడియోలు ప్రచారంలోకి వస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో అధికార పార్టీగా, రాష్ట్రంలోని రాజకీయ వాతావరణానికి BJPదే బాధ్యత. ద్వేషపూరిత ప్రసంగాలు, మతహింస పెరగడం పాలనపరమైన వైఫల్యమే కాదు, ప్రజల సమస్యలు పరిష్కరించలేని అసమర్థతకు కూడా నిదర్శనం. రాజకీయ పార్టీలు విభజన రాజకీయాలకు దూరంగా ఉండి విద్య, వైద్యం, ఆర్థికాభివృద్ధి వంటి అసలు సమస్యలపై దృష్టి పెట్టకపోతే దేశభవిష్యత్తు నిరాశామయం అవుతుంది.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

21 – 23 వీరు దేవునికి సహవర్తులను ఏమయినా ఏర్పరచుకున్నారా, వారు వీరి కొరకు దైవం అనుజ్ఞ ఇవ్వని ధర్మం వంటి విధానం ఏదయినా నిర్ణయించి ఇచ్చారా?[38] తీర్పు విషయం మొదటనే నిర్ణయమయి ఉండకపోతే వీరి తగాదా ఎప్పుడో తీర్చివేయబడి ఉండేది.[39] నిస్సందేహంగా ఈ దుర్మార్గుల కొరకు వ్యధాభరిత మయిన యాతన నిర్ణయమయి ఉంది. నీవు గమనిస్తావు ఈ దుర్మార్గులు ఆ సమయాన తాము చేసినదాని అంతిమ పరిణామం పట్ల భయపడుతూ ఉండగా అది వారికి మూడి తీరుతుంది. దీనికి భిన్నంగా విశ్వసించినవారు, సత్కార్యాలాచరించినవారు స్వర్గపు పూదోటల్లో ఉంటారు. తాము ఏది కోరుకున్నా దాన్ని తమ ప్రభువు వద్ద పొందుతారు. ఇదే మహా అనుగ్రహం. ఇదీ అల్లాహ్ తన దాసులకు, నమ్మి సదాచరణ చేసే వారికి ఇచ్చే శుభవార్త. ప్రవక్తా ఈ జనులకు చెప్పివెయ్యి. నేను ఈ పనికి మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్ని కోరడం లేదు,[40] అయితే బంధుత్వ ప్రేమను తప్పక కోరుకుంటున్నాను. ఎవరు మంచిని సముపార్జించుకుంటారో వారికి ఆ మంచితనంలో మేము మేలును వృద్ధిపరుస్తాము. నిస్సందేహంగా అల్లాహ్ ఎంతో మన్నించేవాడు, విలువ నిచ్చేవాడు.

38. ఈ ఆయత్‌లోని పదం **షురకా** (సహవర్తులు) అంటే, జనులు ఎవరికి వేడుకోలు సమర్పించుకుంటారో, మొరపెట్టు కుంటారో, మొక్కుబడులు చెల్లించుకుంటారో, లేదా పూజా పురస్కారాల లాంఛనాలు నిర్వర్తిస్తారో ఆ సహవర్తులు కారన్నది తెలుస్తూనే ఉంది. దీని ఉద్దేశం తప్పనిసరిగా మానవులన్నది, వారిని జనం దైవాజ్ఞలో సహవర్తులుగా భావిస్తారు ఆలోచనలు, నమ్మకాలు, సిద్ధాంతాలు, తత్వాలు వారు నేర్పగా జనులు విశ్వసిస్తారు; వారు ప్రతిపాదించిన విలువలను అంగీకరిస్తారు. వారు ప్రతిపాదించిన నైతిక నియమాలను, సంస్కృతీ సభ్యతల ప్రమాణాలను జనులు స్వీకరిస్తారు; వారు నియమించిన చట్టాలను, విధానాలను, నిబంధనలను తమ మతపరమయిన రివాజుల్లో ఆరాధనా విధానాల్లో, తమ వైయక్తిక జీవితాల్లో, తమ సామాజిక వ్యవస్థలో, తమ నాగరికతలో, తమ వ్యాపార కార్యక్రమాల్లో, ఇచ్చిపుచ్చుకోవడాల్లో, తమ న్యాయస్థానాల్లో, తమ రాజకీయాల్లో, పరిపాలనా వ్యవస్థలో అవలంబిస్తారు– తాము అనుసరించవలసిన శాసనాంగం, షరీఅత్ ఇదే అయినట్టుగా. ఇదొక పరిపూర్ణ ధర్మం. పరమ ప్రభువు అల్లాహ్ నియమించిన చట్టానికి విరుద్ధంగా, ఆయన అనుజ్ఞ (Sanction) లేకుండా సృష్టించినవారు సృష్టించగా నమ్మేవారు నమ్మారు. దైవేతర శక్తులకు మోకరిల్లడం, దైవేతర శక్తులకు మొరపెట్టుకోవడం, ప్రార్థనలు చేసుకోవటం వంటి బహుదైవారాధనే ఇదీను. (మరిన్ని వివరాలకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.1, అల్ బకర: పాద సూచికలు 170, 286; ఆలి ఇమ్రాన్: ఆయత్: 64 సం.2, అన్ నిసా: పాద సూచి 90; అల్ మాఇద: పాదసూచికలు 1–5, 104, 105; అల్ అన్ ఆమ్: పాదసూచికలు 86, 87, 106, 107; సం.3, అత్ తౌబా: పాద సూచి 31; యూనుస్: ఆయత్‌లు 59, 60; సం.4, ఇబ్రాహీమ్: పాద సూచి 32 అన్ నహ్ల్ : ఆయత్‌లు 114–117; అల్ కహ్ఫ్: పాదసూచిక 50 సం.6, అల్ కసస్: పాదసూచి 86; సబా: ఆయత్ 41, పాద సూచి 63; సం.7, యాసీన్ : ఆయత్ 60, పాద సూచి 53).

39. అంటే, అల్లాహ్‌కెదురుగా, అల్లాహ్ దాసుడయినప్పటికీ అల్లాహ్ ధరణిపైన స్వయంగా తన ధర్మాన్ని అమలుజరపడం ఎంతో తీవ్రమయిన సాహసం; తీర్పు ప్రళయానికి వాయిదా వేసి ఉండకపోయినట్లయితే, ప్రపంచంలోనే ఇటువంటి ప్రతి వ్యక్తిపైన శిక్షా యాతన అవతరింపజేయబడేది; అల్లాహ్ ధర్మాన్ని కాదని ఇతరులు కల్పించిన ధర్మాన్ని స్వీకరించిన వారందరూ సర్వనాశనం చేయబడేవారు.

40. "ఈ పని" అంటే భావం, ప్రవక్త మహనీయులు ప్రజల్ని దైవాగ్రహాన్నుండి, దైవ శిక్ష నుండి రక్షించి స్వర్గం శుభవార్తకు అర్హులుగా చేసేందుకు చేస్తున్న కృషి అన్నమాట.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్‌హుమ్) గొప్పదనం

**329)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటూ ఉండగా నేను విన్నానని ఇబ్నె అబీ ములైకా చెప్పారు: మహనీయ ఉమర్(రజి)– అమరగతి నొందిన తరువాత– ఆయన భౌతిక కాయాన్ని పడకపై ఉంచినప్పుడు, జనులంతా ఆయన భౌతిక కాయం చుట్టూ గుమిగూడి ఆయన మన్నింపునకై (అల్లాహ్‌ను) వేడుకోసాగారు. శవపేటికను ఇంకా ఎత్తలేదు. నేను అక్కడే ఉన్నాను. అంతలో ఒక వ్యక్తి నా భుజాన్ని పట్టుకున్నారు. నేను వెనక్కి తిరిగి చూశాను. ఆయన ఎవరో కాదు, మహనీయ అలీ(రజి). తరువాత ఆయన హజ్రత్ ఉమర్(రజి)ను కరుణించమని దైవాన్ని వేడుకున్నారు. (ఉమర్ భౌతిక కాయాన్ని ఉద్దేశించి) ఇలా అన్నారు: మీరు మీ తదనంతరం నాకు అనుసరణీయుడైన వ్యక్తినెవరినీ విడిచిపోలేదు. అలాంటి ఆదర్శవంతుడైన వ్యక్తి ఉంటే, నేను అతని ఆచరణను అనుసరించి దైవాన్ని చేరుకునేవాణ్ణి. దైవసాక్షి! అల్లాహ్ మిమ్మల్ని మీ సహవాసులిద్దరి సరసన ఉంచుతాడని ముందునుంచే ఊహించుకునేవాణ్ణి. నా ఈ గట్టి నమ్మకానికి కారణమేమంటే, నేను తరచూ దైవప్రవక్త(స) నోట ఈ విధమైన పలుకులు వినేవాణ్ణి (ఆయన ఇలా పలికేవారు): "నేనూ అబూబక్ర్ ఉమర్ వెళ్ళాము" "నేనూ, అబూ బక్ర్ ఉమర్ ప్రవేశించాము" "నేనూ అబూబక్ర్ ఉమర్ వెడలినాము."

**332)** మహనీయ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: ఒక వ్యక్తి (జుల్ ఖువైసరా లేదా అబూ మూసా) దైవప్రవక్త (సఅసమ్)ను, 'ప్రళయం ఎప్పుడు వస్తుంది?' అని ప్రశ్నించగా, "నీవు దాని సన్నాహాలు చేసుకున్నావా?" అని ఆయన(స) అడిగారు. దానికి ఆ వ్యక్తి 'సన్నాహాలేమీ పెద్దగా చేసుకోలేదు. కాకపోతే దైవాన్ని, దైవప్రవక్త (స)ను ఎంతగానో ప్రేమిస్తున్నాను' అని విన్నవించుకున్నాడు. అప్పుడు దైవప్రవక్త(స), "మరి అలాగైతే నీవు ప్రేమించే వారితోనే నీవు లేపబడతావు" అని విశదపరిచారు– హజ్రత్ అనస్(రజి) ఇలా అంటున్నారు: 'నీవు ప్రేమించే వారితోనే నీ పునరుత్థానం జరుగుతుంది' అన్న ఈ ప్రవక్త ప్రవచనం విన్నప్పుడు మాకు కలిగినంత సంతోషం మరెప్పుడూ కలగలేదు'. అనస్(రజి) ఇంకా ఇలా అంటున్నారు: 'నేను దైవప్రవక్త(స)ను, అబూబక్ర్(స)ను, ఉమర్(రజి)ను అమితంగా ప్రేమిస్తున్నాను. ఈ కారణంగా– నేను వారిలాంటి సదాచరణ చేయలేక పోయినప్పటికీ– వారితోపాటే తిరిగి లేపబడతానని ఆశిస్తున్నాను.'

**333)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "నాకు పూర్వం గతించిన సముదాయాలలో దివ్య ప్రేరణ పొందేవారు (విషయాల లోతుల్లోకి పోయేవారు) ఉండేవారు. ఒకవేళ నా సముదాయంలో అలాంటి వ్యక్తి ఎవరయినా ఉన్నాడంటే అతను ఉమర్ మాత్రమే". వేరొక రివాయతు ప్రకారం దైవప్రవక్త(స) ఇలా వక్కాణించినట్లుగా అబూహురైరా (రజి) తెలిపారు: "మీకు పూర్వం ఇస్రాయీల్ సంతతిలోని కొంత మందితో దైవదూతలు సంభాషించేవారు (వారికి విషయావగాహన కల్పించబడేది). నా ఉమ్మత్‌లో ఆ స్థాయి వ్యక్తులు ఎవరయినా ఉన్నారా? అని ఆలోచించినప్పుడు, ఉమర్(రజి) ఆ కోవకు చెందినవాడని అనిపిస్తుంది"– హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) సూరతుల్ హజ్జ్‌లో 'మిన్ నబియ్యిన్ వలా ముహద్దిస్"[1] అని పఠించేవారు.

333-1. దేవుని తరఫున విషయం ప్రేరేపించబడి సత్యం పలికే వానిని, లేదా దైవదూతలు సంభాషించేవానిని 'ముహద్దిస్' అంటారు. అతని అభిప్రాయం సరైనదై ఉంటుంది. నిశ్చయంగా హజ్రత్ ఉమర్(రజి) కూడా ఆ కోవకు చెందినవారే. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) సూరతుల్ హజ్జ్‌లోని 52వ ఆయత్‌ను పఠిస్తున్నప్పుడు, **'వమా అర్‌సల్‌నా మిన్ ఖబ్‌లిక మిన్ రసూలిన్ వలా నబియ్యిన్'**తోపాటు **'వలా ముహద్దిస్'** అని కూడా పలికేవారు.



మహాప్రవక్త (స) ప్రభవించక పూర్వం

# మూఢనమ్మకాల అంధకార లోయల్లో అరబ్బులు

**- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

### నక్షత్ర పూజ

అరేబియాలో నక్షత్రాలను, గ్రహాలను పూజించే వర్గం కూడా ఒకటుండేది. వివిధ తెగలవారు వివిధ గ్రహాలను పూజించేవారు. వాటిలో అత్యంత ముఖ్యమైనవి సూర్యచంద్రులు. అందుకే ఖుర్ఆన్ ఈ నేపథ్యంలో ఇలా అంది :

> **"మీరు సూర్యునికి గానీ, చంద్రునికి గానీ సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేయకండి. వాటిని సృష్టించిన దేవునికి సాష్టాంగపడండి."** ***(హామీమ్ అస్ సజ్దా : 37)***

యమన్‌లో సబా జాతివారు సూర్యుణ్ణే ఆరాధించేవారు. యమన్ రాజు షుమర్ లీరీష్ సూర్యదేవుని మందిరం నిర్మించాడు. సూర్య చంద్రుల తరువాత నక్షత్రాలలో 'షీరా' అనే నక్షత్రాన్ని వారు మిక్కిలి భక్తిశ్రద్ధలతో కొలిచేవారు. అందుకే ఖుర్ఆన్ ఇలా అంది:

> **"షీరా (నక్షత్రము)నకు ప్రభువు కూడా ఆ దేవుడే."**
>
> **(అన్ నజ్మ్: 49)**

### జిన్నులు, షైతానులు, భూతాల పూజ

జిన్నులు, షైతానులకు సంబంధించి అరబ్బుల నమ్మకాలు చిత్ర విచిత్రంగా ఉండేవి. వారు జిన్నులు, షైతానులు, దెయ్యాలు, భూతాలు, కొరివి దెయ్యాలన్నిటినీ ఒకే కోవకు చెందినవిగా నమ్మేవారు. కాకపోతే వాటి ఆకారాలు, చేష్టలు వేర్వేరని అనే వారు. వారు ఎడారులలో, అడవులలో వేషము మార్చి ప్రయాణీకులను మోసగిస్తారనీ, వాటిని 'గౌల్' అని అంటారని, వారు పురుషులు స్త్రీలు కూడా అయి ఉంటారని నమ్మేవారు.

ఉబైద్ బిన్ అయ్యూబ్ అల్ గైరీ ఇలా అంటాడు :

"ఎడారిలో ఇద్దరు గౌల్ దెయ్యాలు ఉండేవి - పురుషుడు, స్త్రీ కూడా. వారిద్దరిపై కంబలి ముక్కలు పడి ఉండేవి."

అమ్ర్ బిన్ యర్బూ అనే ఒక ప్రముఖ వ్యక్తి ఉండేవాడు. అతను 'సాలాత్' అనే స్త్రీ జిన్నును వివాహమాడాడు. ఆవిడ ద్వారా అతనికి సంతానం కూడా కలిగింది. రాజిజ్ ఇలా అంటున్నాడు–

"దేవుడు సాలాత్ కొడుకులను నాశనం చెయ్య!"

సబా (షీబా) రాణి బిల్ఖీస్ సాలాత్ కడుపునే పుట్టిందని వారు (సగర్వంగా) చెప్పుకున్నారు.

వారు చాలా ఎక్కువగా పాటలు పాడేవారు. వారి పాటల వల్ల అరబ్బులు సురక్షితంగా ఉంటారనే నమ్మకం ఉండేది.

"గాఢాంధకారం అలుముకున్న రాత్రులలో ఎడారుల్లోని జిన్నాతులు రాగాలు తీస్తూ కథలు చెబుతుండగా నేను ఎడారి ప్రయాణం చేశాను."

ఈ జిన్నాతులు ఎడారుల్లోని పల్లెటూరి ప్రజల వెంట ఉండేవారు. చలికాలంలో చలిమంటలు వేసినపుడు వారొచ్చి మంట కాచుకునేవారు. కాని వారిని భోజనానికి పిలిచినపుడు, "మేము మానవుల ఆహారం తినము" అని సంజాయిషీ ఇచ్చేవారు.

"వారు రాత్రి నా దగ్గరకు వచ్చినపుడు 'మీరెవరు?' అని అడిగాను. 'మేము జిన్నులం' అని వారు చెప్పారు. 'ఇంతటి చీకటిలో మీరు సంతోషంగా ఉంటున్నారా?' అని నేనడిగాను. మౌనం వహించారు. నేను వారిని భోజనానికి పిలిచాను. దానికి సమాధానంగా వారి నాయకుడు, 'మేము మానవుల భోజనంపై అసూయ చెందుతాము' అని చెప్పాడు."

వారి ప్రకారం జిన్నాతుల రకాలు ఇవి :

- మనుషులతో కలసిమెలసి ఉండే జిన్నులను 'ఆమిర్' అనేవారు.
- చిన్న పిల్లలను కష్టపెట్టే వాటిని 'భూతాత్మ' అనేవారు.
- ఇంకా ఎక్కువ దుర్మార్గులను షైతానులు అని పిలిచేవారు.
- దుర్మార్గంలో మరీ హద్దుమీరి పోయిన వారిని 'అఫ్రియత్'గా వ్యవహరించేవారు.

వారు సాధారణంగా చిన్న పిల్లలను, యువకులను ఎత్తుకుపోయేవారు. హజ్రత్ అలీ (రజి) సోదరుల్లో ఒకరు తాలిబ్. అతనిని కూడా వారు ఎత్తుకుపోయారు. ఆ తరువాత అతని జాడ తెలియరాలేదు. అరేబియా రాజైన అమ్ర్ బిన్ లుఖ్యాని కూడా ఎత్తుకుపోయారు. కాని కొన్నేండ్ల తర్వాత తెచ్చి ఇచ్చారు.

అలాగే ఖురాఫా వృత్తాంతం ... అతనిని కూడా జిన్నులు ఎత్తుకెళ్ళారు. చాలా కాలం తర్వాత అతను తిరిగి వచ్చి ఎన్నో చిత్ర విచిత్రమయిన విషయాలను తెలియపరచాడు.

జిన్నులు, షైతానులతో గట్టి సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తులుగా తాబ్బత్ షరా, అబుల్ బలాద్ తహ్వా సుప్రసిద్ధులు. తహ్వా ఒకసారి ఒక దయ్యాన్ని చంపేశాడు. ఆ హత్యోదంతాన్ని అతను ఒక పద్య రూపంలో ఇలా వివరించాడు :

> **"నేను ఎడారిలో సంచరించే కొరివి దెయ్యాన్ని కలుసుకున్నాను. అది నన్ను అడ్డుకున్నప్పుడు నేను యమన్‌లో తయారైన ఖడ్గంతో దానిపై దాడిచేసి దానిని అంతమొందించాను. అంతే, అది నేలకొరిగింది."**

జిన్నుల, షైతానుల ఈ పొగరును అణచడానికి దివ్య ఖుర్ఆన్ ప్రళయదినాన ఈ ప్రశ్నోత్తరాల విధానాన్ని అనుసరించింది – దీనినిబట్టి ఈ జిన్నులు – మనుషులు ఏ విధంగా ఒండొకరికి సహాయ సహకారాలందజేసుకున్నారో, అజ్ఞానులైన అరబ్బులు ఏ మేరకు జిన్నుల్ని నమ్ముకున్నారో అవగతం అవుతుంది –

> **"ఓ జిన్ను వర్గీయులారా! మీరు మనుషుల్లోని చాలా మందిని వాడుకున్నారు కదూ!" (అని అల్లాహ్ అడిగినప్పుడు) వారి అనుంగు అనుచరులైన మనుషులు ఇలా విన్నవించుకుంటారు : 'మా ప్రభూ! మాలోని ప్రతి ఒక్కరూ ఒకరింకొకరి ద్వారా లబ్ధి పొందారు."** ***(అల్ అన్ ఆమ్ : 128)***

## జ్యోతిష్యం

ఆనాడు జ్యోతిష్యం సమాజం పాలిట ఓ విపత్తుగా ఉండేది. దాని వ్రేళ్లు రాజ్యమంతా ఆక్టోపస్‌లా అల్లుకుపోయి ఉండేవి. ప్రతిచోటా జ్యోతిష్కులుండేవారు. వారు భవిష్యవాణి చెప్పేవారు. ఆకాశ విషయాలు తెలియజేసేవారు. తమలో ప్రతి ఒక్కరి వెంట ఒక్కొక్క జ్యోతిష్కుడున్నాడని అరబ్బులు గొప్పలు చెప్పుకునేవారు. ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) తన వైపు నుండి సాగిపోతున్న ఒక వ్యక్తిని దగ్గరకు పిలిచారు. అతని వాలకం చూస్తే జ్యోతిష్కుడిలా ఉన్నాడు. "నీ జిన్ను నీకు చెప్పిన వింతలు, విశేషాలేమిటి?" అని ఆయన అతనిని అడిగితే, 'నేనొక రోజు బజారులో సంచరిస్తూ ఉండగా, నా జిన్ను ఆందోళన చెందుతూ నా దగ్గరకు వచ్చి "ఏమిటి, నీవు వీళ్ళ కలవరాన్ని, నిరాశను, వీరి కార్యకలాపాలు మందగించటాన్ని చూడటం లేదా?" అని అన్నాడు.

దానికి ఉమర్ (రజి) ఇలా అన్నారు : నువ్వు చెప్పింది నిజం. అజ్ఞాన కాలంలో నేనొక రోజు విగ్రహాల దగ్గరపడుకున్నాను. అప్పుడు నేను కలలో ఒక వ్యక్తి ఆవు దూడను తెచ్చి జిబహ్ చేస్తున్నట్లు చూశాను. ఆ తరువాత ఒక వ్యక్తి బిగ్గరగా,

"ఓ జులైహ్! విజయీభవ! అసలు విషయం ఏమిటంటే ఒక మహామనీషి **లా ఇలాహ ఇల్లల్లాహ్** అని అంటున్నాడు" అని చెప్పాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకే మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తగా నియుక్తులయ్యారు (సహీహ్ బుఖారీ). సహీహ్ బుఖారీ, అజ్ జుహా సూరా వ్యాఖ్యానంలో భాగంగా వచ్చిన సంఘటన– ఒకసారి మహాప్రవక్త (స) అస్వస్థతకు గురయ్యారు. రెండు మూడు రాత్రులు ఆయన దైవారాధన నిమిత్తం లేవలేకపోయారు. దానిపై ఒక స్త్రీ (ఆమె అబూలహబ్ భార్య) వచ్చి దైవప్రవక్త (స)తో: "నా ఉద్దేశంలో నిన్ను ఆవహించిన షైతాన్ బహుశా నిన్ను

వదిలేసినట్టుంది” అని అంది.

బహుశా ఈ ఉద్దేశంతోనే అవిశ్వాసులైన మక్కావాసులు మహా ప్రవక్త (స) వెంట ఏ జిన్నో, షైతానో ఉన్నాడని తలపోసేవారు. దివ్య ఖుర్‌ఆన్ దీనిని ఖండిస్తూ ఇలా అంది :

> **“(ప్రజలారా!) షైతానులు ఎవడిపైన దిగుతారో నేను మీకు తెలుపనా? అబద్ధాలకోరు, పాపాత్ముడు అయిన ప్రతి ఒక్కరిపై వారు దిగుతారు. వినీవినని కొన్ని మాటల్ని చెవుల్లో వేస్తారు. వారిలో అనేకులు అబద్ధాలు చెప్పేవారే.”**
>
> ***(అష్ షుఅరా : 221 - 223)***

ఈ తాంత్రికులు వివిధ వివాదాలపై తీర్పులు కూడా ఇచ్చేవారు. తత్కారణంగా రాజ్యంలో వారు మకుటంలేని మారాజుల్లా చెలామణీ అయ్యేవారు.

ఈ తాంత్రికులు విగ్రహాలయాలలో తిష్ఠవేసి ఉండేవారు. ఏదో ఒక విగ్రహాన్ని ప్రత్యేకంగా పూజించేవారు. జనులు అగోచర విషయాల గురించి, భవిష్యత్తు గురించి అడిగినప్పుడు తమపై ఏవో శక్తులు అవతరిస్తున్నట్లుగా అభినయం చేసేవారు. మగవారు, ఆడవారు కూడా క్షుద్రవిద్యలు (చేతబడులు) చేసేవారు. పీడలు, విపత్తులను దూరం చేయడానికి బహుదైవోపాసనా ఉపాయాలు సూచించేవారు. తాము చెప్పిన జోస్యానికి గాను భారీ మొత్తంలో పారితోషికాలు వసూలు చేసేవారు. ఇస్లాం ఆవిర్భవించిన తరువాత ముస్లింలుగా ధర్మపరివర్తన చెందిన ఒక సహాబీ ఈ తాంత్రిక వర్గానికి చెందిన వారి అసలు రంగును బయటపెట్టారు (సహీహ్ బుఖారీ). పారితోషికంగా, నజరానాగా తమకు లభించిన మొత్తానికి వారు ‘తాంత్రికుని నోరు తీపి చేసే కానుక’ అని పేరుపెట్టారు. ఇస్లాం ఆవిర్భవించిన తరువాత ఈ పోకడలను నిర్మూలించింది.

## మూఢ నమ్మకాలు

వారు పామును చంపేవారు కారు. పామును చంపితే దాంతో జతకట్టిన పాము వచ్చి ప్రతీకారం తీర్చుకుంటుందన్న నమ్మకం ఉండేది. మనిషి చనిపోయిన తర్వాత ఆత్మ ఒక పక్షిలా ఎగురుతూ ఉంటుందనేవారు. దానిని ‘హామా’ అనేవారు. కడుపులో ఒకటేదో ఉంటుందనీ, ఆకలేసినప్పుడు అది కొరుకుతుందని అనేవారు. ఏదైనా కార్యాన్ని తలపెట్టినప్పుడు శకునం చూసేవారు. ఉదాహరణకు : ఆ సమయంలో ఏదైనా పక్షి కుడివైపున ఎగిరితే దానిని మంచి శకునంగా భావించేవారు. ఎడమ వైపు నుంచి ఎగిరితే ఆ పనిని మానుకునేవారు. మేక ఈనినప్పుడు, పోతు పిల్ల పుడితే దానిని విగ్రహం ముందు సమర్పించేవారు. ఒంటె గనక పది పిల్లలను ఈనిందంటే దానిని అచ్చోసి వదలిపెట్టేసేవారు. అది ఎక్కడికెళ్ళినా, ఎక్కడ మేసినా ఎవరూ దాని జోలికి పోరు.

ఎవరి వద్దనయినా ఒంటెల సంఖ్య వెయ్యికి చేరితే, ఒక ఒంటె కన్నును పొడిచి నష్టపరిచేవారు. అలా చేసినట్లయితే దిష్టి తగలదని నమ్మేవారు. ఎప్పుడయినా కరువు కాటకాలొస్తే ఒక గొర్రె లేదా పొట్టేలు తోకకు గడ్డికట్టి నిప్పు పెట్టేవారు. ఆ విధంగా చేస్తే వర్షం కురుస్తుందని భావించేవారు. ప్రయాణానికి వెళుతున్నప్పుడు ఏదైనా చెట్టుకొమ్మకు త్రాడు ముడివేసి వెళ్ళేవారు. ప్రయాణం నుంచి తిరిగొచ్చాక అక్కడికెళ్ళి చూసేవారు. ఒకవేళ ముడిగనక విచ్చుకుని ఉంటే, భార్య పరాయి మగాడితో కులికినట్లు లెఖ్ఖ. ప్రయాణంలో ఎక్కడయినా దారి తప్పినట్లయితే దుస్తుల్ని తిరగవేసి తొడుక్కునేవారు. అలాచేస్తే దారికి వస్తామని నమ్మేవారు. లాత్, ఉజ్జా దేవతలను దూషించేవానికి కుష్టువ్యాధి గానీ, బొల్లివ్యాధి గానీ వస్తుందని భావించేవారు (ముస్నద్ దారిమీ). చేతివ్రేళ్ళకు ఇత్తడి ఉంగరం తొడిగేవారు. దానివల్ల బలహీనత దూరమవుతుందని నమ్మేవారు (ఇబ్నుమాజా).

సమాజంలో ప్రబలి వున్న ఇలాంటి మూఢనమ్మకాలు లెక్కలేనన్నివి.

ఇవీ వారి మతపరమైన భావాలు, భావనలు.

ఇక వారి నైతిక పరిస్థితిని చూస్తే అది ఇంతకన్నా అధ్వాన్నంగా ఉండేది. వారి నైతిక లోపాలలో అన్నిటికన్నా ప్రస్ఫుటమైనది వారిలోని యుద్ధకాముకత. అది వారిని రక్తపిపాసులుగా, కర్కశులు, కఠినాత్ములుగా మార్చివేసింది.

***(మౌలానా సయ్యిద్ సులైమాన్ నద్వీ-రహ్మ- విరచితమైన ‘సీరతున్నబీ’ పుస్తకం 4వ సంపుటం ఆధారంగా)***

**(మిగతా వచ్చే సంచికలో)**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక


‘చరితార్థులు’-2



# పఠాన్ సలాబత్ ఖాన్

## (1831-1861)

24







**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త**

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

**రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**


ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే మహోజ్వల ఘట్టంగా భాసించిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అద్వితీయమైన సాహసాలతో ఆత్మార్పణకు కూడా వెనుదీయని వీర సైనికులలో ఒకరైన పఠాన్ సలాబత్ ఖాన్ ఉత్తరప్రదేశ్‌లోని మురాదాబాద్ జిల్లా సంభల్‌లో 1831లో జన్మించారు. ఆయన తండ్రి పఠాన్ అబ్దుల్లా ఖాన్. చిన్ననాటి నుండే ధైర్యసాహసాలను ప్రదర్శిస్తూ గ్రామస్తులను ఆకట్టుకున్న సలాబత్ సైనికుడిగా కోటా రాజ్యంలో ఉద్యోగం చేబట్టి గోవర్ధన్ పటాలంలో సభ్యులయ్యారు. 1857 మే మాసంలో భారతదేశం అంతటా ఎగిసిపడిన తిరుగుబాటు జ్వాలల ప్రభావంతో ఈస్ట్ ఇండియా కంపెనీ రాజకీయ ప్రతినిధి మేజర్ బుర్టన్ నివాస గృహం మీద కోట సైనికుల దళం 1857 అక్టోబర్ 15న దాడి చేసి తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. ఆ యోధుల ధాటికి తట్టుకోలేక మేజర్ బుర్టన్ బ్రతుకు జీవుడా అంటూ ఆయుధాలు, అనుచరులతో తన బంగ్లాలో దాక్కున్నాడు. ఆయుధాలు కలిగి ఉన్న ఆంగ్లేయుడిని బంగ్లా నుండి బయటకు రప్పించేందుకు సాహసి పఠాన్ సలాబత్ ఖాన్ ముందుకు వచ్చారు. ఒక నిచ్చెన ద్వారా తిన్నగా ఆంగ్లేయుడు దాక్కొని ఉన్న బంగ్లా కప్పు మీదకు చేరుకుని, అతని అనుచరుల కంటబడకుండా ఆకస్మాత్తుగా బుర్టన్ ఎదుట నిలిచారు. ఆ అనూహ్య సంఘటన నుండి తేరుకొని తన మీద ఆంగ్లేయుడు సాగించిన దాడి నుండి లాఘవంగా తప్పించుకున్న సలాబత్ అతడ్ని లొంగదీసుకున్నారు. ఈ సందర్భంగా సలాబత్ ఖాన్ చూపిన తెగువ, సాహసానికి సంతసించి తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్న లాలా జై దయాల్ భట్నాగర్ ఆయనకు ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు. ఆ తరువాత 1858 మార్చిలో మేజర్ జనరల్ రాబర్ట్స్ నాయకత్వంలోని సైనిక దళాలు కోట సంస్థానాన్ని స్వదేశీ దళాల నుండి స్వాధీనం చేసుకున్నాయి. ఆ సమయంలో తిరుగుబాటు దళాలతోపాటుగా సలాబత్ ఖాన్ గ్వాలియర్ వెళ్ళి తిరుగుబాటు యోధులతో కలసి ఝబియా పట్టాన్ అను చోట ఈస్ట్ ఇండియా కంపెనీ దళాలతో జరిపిన పోరాటంలో పాల్గొన్నారు. ఆ తరువాత ఆంగ్లేయుల నిఘా నుండి తప్పించుకుని, లక్నో గుండా నేపాల్ పర్వత ప్రాంతాలలోకి తప్పించుకున్నారు. అక్కడ ఎదురైన ప్రతికూల పరిస్థితుల వలన ప్రవాసం నుండి బయటపడి రహస్యంగా కోటా రాజ్యంలోకి తిరిగి ప్రవేశిస్తుండగా శతృసైనికులు నిర్బంధించారు. ఆయన మీద రాజద్రోహం నేరారోపణ మోపి 1861 ఆగస్టు 10న ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు ఆయనకు మరణదండన ప్రకటించారు. ఆ మరణ దండన ప్రకారం 1861 అక్టోబరు 23న కోటా రాజ్యంలోని బ్రిటిష్ అధికార ప్రతినిధి నివాసం ఎదుట ఇతర యోధులతో పాటుగా పఠాన్ సలాబత్ ఖాన్‌ను బహిరంగంగా ఉరితీశారు. ✤




పుస్తక సమీక్ష

# మేఘ గర్జన

## అబాబీలు

– బతూల్ హుమైర్వీ

**తెలుగు** సాహిత్య వినీలాకాశంలో అద్భుతమైన భావవ్యక్తీకరణతో మరో అబాబీల సైన్యం ఉరుములు మెరుపుల మేఘ గర్జనతో భీకరమైన తుఫానును తలపిస్తూ, హెచ్చరిస్తూ మరీ మన ముందుకు వచ్చింది. ఆధునిక సంస్కృతి పేరుతో, ప్రజాస్వామిక విలువల్ని మట్టు బెడుతూ, సామ్రాజ్యవాద శక్తుల వెన్నుదన్నుతో కారుకూతలు కూస్తున్న, నేటి మెజారిటీ మతతత్వ ఫాసిస్టు శక్తుల ముందు నిర్భయంగా ప్రశ్నల తుఫాను కురిపించే అతి భయంకరమైన అబాబీలివి..తమ గర్జనతో పాఠకుల మనోమస్తిష్కాలను మేలుకొలిపి, చైతన్యపు దివిటీలను చేత బూనే అబాబీలివి.

**అణచాలని చూడకు**
**గాలిలా రేగి తుఫానులా మారుతా!**
**నిప్పు కణికల తుంపరనై,**
**అగ్నిగుండమై దహించేస్తా!**

అంటూ ప్రశ్నించే నోళ్లకు సీళ్ళు వేస్తున్న ప్రజాస్వామ్య గుండెల్లో దడ పుట్టించి దుమారం రేగించే అబాబీలివి. ప్రజలలో చైతన్యపు నిప్పు కణికలను రాజేసే అబాబీలివి.

**అలాగే మరో అబాబీల్లో,**
**కలం కాదు ఇది కరవాలం**
**అక్షరమే ఒక ఆయుధం**
**అజ్ఞాన అంధకారాన్ని**
**ఖుర్షీదు!**
**మార్చేది రాతలే గుర్తించుకో!**

అంటూ ఆధునిక సాంస్కృతిక తుఫానును ఎదుర్కోవడానికి, కత్తులు ఖడ్గాలు కాదు కావాల్సింది, అక్షరం అనే ఆయుధంతోనే అజ్ఞానపు అంధకారాన్ని తరిమికొట్టాలనే విషయాన్ని హృద్యంగా వివరించారు.

**డబ్బు కోసమే దోస్తీ**
**పైసలకు లోకంలో కుస్తీ**
**రూపాయి రాదు నీ వెంట**
**ఖుర్షీదు!**
**వట్టి చేతులతో మట్టి పాలు కదకు!**

**కాలం మంచులా కరిగిపోతుంది**
**మరణం కాపు కాసి ఉంది**
**జీవితం ముగియడం నిజం**
**నీలో నీ విశ్వాసిని మేలుకొలుపు!**

అంటూ నేటి భౌతిక వాద ప్రపంచంలో మనిషి పైసలకు దాసోహమై, తన మృత్యువునే మరిచిపోతున్నాడనీ, మనిషి జీవిత అసలు గమ్యాన్ని గ్రహించకపోతే అతని ఉనికికే ప్రమాదం అంటూ గర్జిస్తున్న అబాబీలివి.

**ద్వేష జ్వాల రాజేసి చలి కాచుకో**
**రుధిరధారతో హోలీ ఆడుకో**
**పైశాచికత్వానికి పరాకాష్ట ఇది**
**ఖుర్షీదు!**
**మనిషి మృగమైన వేళ ఇది!**

అంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకంగా పలస్తీనాలో సామ్రాజ్యవాదం జరుపుతున్న దమనకాండకు అద్దం పడుతున్న అబాబీలివి. ఆధునిక సాంకేతిక ప్రగల్భాలతో విర్రవీగుతున్న ఇజ్రాయిల్ అమెరికా లాంటి సామ్రాజ్యాలు నేటి పసిపిల్లలు అబాబీళ్ళుగా మారుతారనే భయోత్పాతానికి గురై అత్యంత దారుణంగా హతమారుస్తున్న వీరి పైశాచిక పరాకాష్టకు మానవత్వం చేష్టలుడిగి చూస్తుందని నిట్టూర్చడం నిజాన్ని నిర్భయంగా చాటడమే. తమ చరిత్రను లిఖించుకున్న జాతులే ప్రపంచంలో ఉనికిని చాటుకుంటాయనే విషయాన్ని చెప్పకనే చెప్పేస్తున్నాయి...

**తుడిచేస్తే పోతుందా చరిత్ర**

**చెరిపేయగలవా కీర్తి, ఘనత**

**సిలబస్ ను మార్చగలవేమో!**

**ఖుర్షీదు!**

**వాస్తవాలను రూపుమాపగలవా?**

సామరస్యంగా జీవించే దేశ సోదర వాసుల్లో విద్వేషపు అడ్డుగోడలను నిర్మించి, తమ అసహ్యకరమైన రాజకీయాలు నడుపుతున్న మతతత్వ శక్తులకు, వాస్తవ దృక్పథంతో చూడమని సవాలు విసురుతున్న ఈ అబాబీలు తాము చరితార్థులమనీ, పరస్పర ప్రేమ, సహృద్భావాలతో చరిత్ర హీనులను మట్టి కరిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటిస్తున్నాయి.

హిట్లర్ జాత్యహంకార చరిత్ర నేపథ్యంలో ప్రముఖ రచయిత ప్రొఫెసర్ టోయిన్ బి ఉటంకించిన విధంగా సంస్కృతుల ఉత్థాన పతనాల వెనుక దాగి ఉన్న ప్రధాన కారణం జాతివాదమే అని, అది సంస్కృతుల వినాశనానికి మూల కారణమని పేర్కొంటూ ప్రజలు దీన్ని అడ్డుకోకపోతే సాంస్కృతిక నావలు మునిగిపోతాయని హెచ్చరించిన విషయాన్ని బాగా జీర్ణించుకున్న రచయిత్రి, తాను నమ్మిన తాత్వికత పైనే అపార్థాల ముసురు పట్టడంతో తన సాంస్కృతిక ప్రమాణాలు విలువల నావను కాపాడుకునే ఉద్దేశంతో కలాన్ని ఝుళిపించిన తీరు హర్షణీయం.

ఈ పుస్తకంలోని ప్రతి అబాబీలు జీవితంలోని అన్ని రంగాలనూ స్పృశిస్తూ, పాఠకుల్లో ఓ కొత్త చైతన్యాన్ని మేలుకొలిపే విధంగా ఉంది. ఉపాధ్యాయ రంగంలో సేవలందించే సోదరి ఖుర్షీద్ బేగం తన అబాబీల ప్రస్థానం ద్వారా తనలో దాగి ఉన్న సామాజిక స్ఫూర్తి చైతన్యాన్ని సైతం చాటుకున్నారు. సోదరి రాసిన ఈ అబాబీలు ప్రజా జీవితాల్లో వెలుగులు నింపేందుకు దోహదపడతాయని ఆశిస్తూ, సోదరి కలం ద్వారా మరిన్ని కవితా సంపుటాలు జాలువారాలని కోరుకుందాం.

## ఉత్తరాఖండ్ మదరసాల్లో చదువుకుంటున్న ముస్లిమేతర పిల్లలు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని 30 మదర్సాలలోని 7,399 మంది విద్యార్థుల్లో దాదాపు 10% మంది ముస్లిమేతరులేనని ఉత్తరాఖండ్ మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు ఇటీవలి నివేదిక వెల్లడించింది. నేషనల్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ హైలైట్ చేసిన ఈ గణాంకాలు ఉత్తరాఖండ్‌లోని విద్యారంగం పరిస్థితి ఎలా ఉందో చెబుతున్నాయి. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వ హయాంలో విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలలుగా పరిగణించబడని మదర్సాలలో ముస్లిమేతర పిల్లలు చదువుకుంటున్నారు. నేషనల్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ప్రకటించిన అభ్యంతరాలు, విమర్శలు సమస్యను ప్రతిబింబిస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని కాంగ్రెస్ పార్టీ, అధికార ప్రతినిధి గరిమా మెహ్రా దాసౌని బీజేపీ పాలిత రాష్ట్రంలో విద్యావ్యవస్థ దుస్థితిని వేలెత్తి చూపించారు. చదువుకునే అవకాశాలు లేని ముస్లిమేతర పిల్లలు మదర్సాలలో చదువుకోవడం బిజెపి పాలన వైఫల్యానికి నిదర్శనంగా కాంగ్రెసు విమర్శిస్తోంది. ముస్లిమేతర కుటుంబాలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు బదులు మదర్సాలకు పంపవలసి వస్తున్న ఈ పరిస్థితి బీజేపీ వైఫల్యానికి నిదర్శనంగా చూపిస్తున్నారు. దీనిపై బీజేపీ స్పందించింది. రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి మన్‌వీర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ఈ అడ్మిషన్‌లకు దారితీసిన పరిస్థితులను పరిశోధించి, అక్రమంగా నడుస్తున్న మదర్సాలను మూసేస్తామని అన్నాడు. విద్యాజ్ఞానాలు అందిస్తున్న మదరసాలను మూసేస్తాం అంటున్నాడు కాని, విద్యా సౌకర్యాలు కల్పించడం గురించి మాత్రం మాట్లాడలేదు. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ అమలు, సంస్కృతం ప్రవేశపెట్టడంతోపాటు మదర్సాలను ఆధునీకరించేందుకు ఉత్తరాఖండ్ వక్ఫ్ బోర్డు చేస్తున్న కృషి అభినందనీయం. కాని బీజేపీ నేతలు మాత్రం మతపరమైన విషయాలను లేవనెత్తి, విద్యాపరమైన సదుపాయాలు కల్పించలేని తమ ప్రభుత్వ అసమర్థతను దాచిపెట్టి రాజకీయాలు చేస్తున్నారు. విద్య, వైద్య ఆరోగ్య , ఆర్థిక రంగాల్లో సమస్యల పరిష్కారానికి బదులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మతతత్వ రాజకీయాలు నడపడమే ప్రధానంగా కనిపిస్తుంది.



# కష్టాలు కడగండ్లు కరగాలంటే...

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**యావత్తు విశ్వసార్వభౌమత్వం హస్తగతమైవున్న దేవుడు ఎంతో శుభదాయకుడు. ఆయన ప్రతి వస్తువుపై, ప్రతి విషయంపై సర్వాధికారం కలిగి ఉన్నాడు. మీలో ఎవరు మంచి పనులు చేస్తారో (మరెవరు చెడ్డపనులు చేస్తారో) పరీక్షించడానికి ఆయన జీవన్మరణాలు సృష్టించాడు. ఆయన మహా శక్తిమంతుడు, గొప్ప క్షమాశీలి. (అల్ ముల్క్ : 1-2)**

జీవితం ఎల్లప్పుడూ మనమీద మనకే సవాళ్ళను విసురుతూనే ఉంటుంది, వాటిని ఎదుర్కొని నిలిచినప్పుడే విజేతలమవుతాము. పోరాడాలనుకుంటే ముందు మనపై మనం గెలవాలి, మనలోనే ఉన్న మన శత్రువుపై గెలవాలి. మనపై మనం గెలవడం అంటే? మనం ఎదుర్కొనే ప్రతి సవాలు, మనం సాధించలేమని, మనం చేతకానివారమని, మనం బలహీనులమని మనల్ని హేళన చేసినప్పుడు దానికి మనమిచ్చే సమాధానం- మన ధైర్యం, మనలో ఉన్న విశ్వాసమే.

విశ్వాసంలో ఒక వినూత్నమైన అనుభవం అనుదినం అయిదు పూటల ప్రార్థనలలో మన జీవితంపై మనమే పోరాడడం. విశ్వాసి జీవితంలో ప్రార్థనా పోరాటానికి అల్లాహ్ కృప తోడైతే ఈ అంతరంగ యుద్ధంలో అంతిమ విజయం మనదే. “మనం విశ్వకర్త అయిన అల్లాహ్‌ను విశ్వసించాము. అయితే మనలో... మనకు మాత్రమే తెలిసిన రహస్యమైన కొన్ని లోపాలు, పాపాలు మిగిలి ఉన్నాయి. వాటిని మనం ఎలా జయించగలము” అనే ఆలోచనలు ఉన్నప్పుడే ఈ అంతరంగ యుద్ధం మొదలవుతుంది, అల్లాహ్ చిత్తమయితే మనకు ఆత్మశుద్ధి లభిస్తుంది. ఏదైనా సాధించాలనే సంకల్పం మనలో బలంగా ఉంటేనే మన చుట్టూ ఉండే ప్రతికూల పరిస్థితులు కూడా అనుకూలంగా మారుతాయి, అనుకూలంగా అల్లాహ్ మారుస్తాడు.

**విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థన చేస్తూ (మా)సహాయం అర్థిస్తూ ఉండండి. దేవుడు సహనం వహించేవారికే తోడుగా ఉంటాడు. (అల్ బఖరః - 153)**

మరో చోట ఇలా అంటున్నాడు:

**భయం, ఆకలి, ధనప్రాణ, పంటల నష్టాలు కలిగించి మిమ్మల్ని మేము తప్పనిసరిగా పరీక్షిస్తాము. అలాంటి స్థితిలో సహనం వహించి, ఆపద వచ్చినప్పుడు “మేము దేవునికి చెందినవారం. దేవుని వైపునకే పోవలసినవాళ్ళం” అని పలికేవారికి వారి ప్రభువు కారుణ్య కటాక్షాలు లభిస్తాయని శుభవార్త విన్పించు... అలాంటివారే సన్మార్గగాములు. (అల్-బఖరహ్: 155-157)**

అల్లాహ్ చేస్తున్న వాగ్దానాన్ని కూడా కాస్త గమనించండి:

మీ పూర్వీకులను అల్లాహ్ ఏవిధంగా లోకంలో ఖలీఫా (దైవ ప్రతినిధి)గా చేశాడో అదేవిధంగా మీలో విశ్వసించి సత్కార్యాలు చేసేవారిని కూడా ఖలీఫాగా చేస్తానని ఆయన వాగ్దానం చేస్తు న్నాడు. అదీగాక వారి కోసం తాను ఆమోదించిన ధర్మాన్ని వారు ఆచరించేందుకు పటిష్ఠమైన పునాదులపై నెలకొల్పుతానని, వారి (ప్రస్తుత) భయానక స్థితిని శాంతియుతంగా మారుస్తానని కూడా వాగ్దానం చేస్తున్నాడు. అయితే వారు నన్ను మాత్రమే ఆరాధిం చాలి. నాకు మరెవరినీ సాటి కల్పించకూడదు. ఆ (వాగ్దానం) తర్వాత ఎవరు తిరస్కార వైఖరి అవలంబిస్తారో వారే దుర్జనులు. విశ్వాసులారా! ప్రార్థనా వ్యవస్థను నెలకొల్పండి. పేదల ఆర్థిక హక్కు (జకాత్) నెరవేర్చండి. దైవప్రవక్త పట్ల విధేయత కలిగి ఉండండి. అప్పుడే మీరు కటాక్షించబడతారని ఆశించగలరు. (నూర్: 55-56)

## కష్టాలను కరిగించే కరదీపికలు

**1) దుఆ** : దుఃఖాన్ని దూరం చేసే గొప్ప ప్రార్థనలలో ఒకటి ప్రవక్త యూనుస్ (అ) వారి ప్రార్థన.

**"లా ఇలాహ ఇల్లా అంత సుబ్హానక ఇన్నీ కుంతు మిన జ్జాలిమీన్"**

చివరికతను (చేప కడుపులో చిక్కుకొని) గాఢాంధకారంలో "నీవు తప్ప మరో నిజ ఆరాధ్యుడు లేడు. నీవు పరిశుద్ధుడవు. నేనే నిజంగా నా ఆత్మకు అన్యాయం చేసుకున్నాను" అని మొర పెట్టుకున్నాడు. మేమతని మొరాలకించి అతడ్ని బాధ, పరితాపాల నుండి విముక్తి కల్గించాం. ఇలాగే మేము విశ్వాసుల్ని రక్షిస్తాం. (అన్ బియా: 87-88)

**2) ధర్మ పాలన** : మనం ధర్మ శాస్త్రానికి కట్టుబడి జీవిస్తే అల్లాహ్ మనల్ని రక్షిస్తాడు.

**3) అల్లాహ్ స్మరణ** : కలిమి స్థితిలో మనం అల్లాహ్‌ను స్మరిస్తే, కష్ట సమయంలో అల్లాహ్ మనల్ని గుర్తుంచుకుంటాడు.

**4) మనం మారితే మన స్థితి మారుతుంది** : అల్లాహ్ ఆదేశాల కనుగుణంగా మన జీవితాన్ని మనం మార్చుకుంటే మనకే సమస్య వచ్చినా అల్లాహ్ మన ముందుండి మనల్ని ఆదుకుంటాడు.

**5) దైవ భీతి** : అల్లహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించినవారికి ఈ మాటల ద్వారా ఉపదేశం చేయబడుతోంది: అల్లాహ్‌కు భయ పడుతుండేవాడికి అల్లాహ్ కష్టాల నుంచి బయటపడే దారి చూపుతాడు. (ఒకవేళ ఏవైనా ఇబ్బందులుంటే) అతనికి అల్లాహ్ అతని ఊహకు సైతం అందని దిశ నుండి ఉపాధినిస్తాడు. (తలాఖ్: 2-3)

**6) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యెడల నమ్మకం** : అల్లాహ్‌ను నమ్ముకునేవాడికి అల్లాహే చాలు. అల్లాహ్ తన పని తప్పకుండా నెరవేరుస్తాడు. ఆయన ప్రతి దానికీ ఓ లెక్క నిర్ణయించిపెట్టాడు. (తలాఖ్: 3)

**పండితుల మాట బంగారు మూట:** నలుగురు నాలుగు విధాలు అనడం ఒక ఆనవాయితీ. అయితే ఆ నలుగురు నాలుగు వేర్వేరు సమస్యలతో సతమతమవుతూ కూడా ఈ విషయాలను వారు ఎలా విస్మరిస్తున్నారో మాకు అంతుబట్టడం లేదు అన్నారు పండితులు. ఎవరా నలుగురు? ఏమిటి వారి సమస్యలు? వారు మరచిన ఆ విషయాలు ఏవి? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే..

1) అనారోగ్యంతో, అస్వస్థతతో బాధ పడే వ్యక్తి ...

అయ్యూబ్ గాథ కూడా గుర్తుకు తెచ్చుకో. అతను (వ్యాధిగ్రస్త స్థితిలో ఉండి) "(ప్రభూ!) నేను జబ్బుపడ్డాను. నీవు అందరి కంటే గొప్ప దయామయుడవు" అని ఎలుగెత్తి మొరపెట్టుకున్నాడు. మేమతని మొరాలకించి అతని బాధ దూరం చేశాం. అతనికి మేము అతని భార్యాపిల్లలనే కాదు, మా ప్రత్యేక అనుగ్రహంతో ఇంకా అనేక భాగ్యాలు కూడా ప్రసాదించాం. సదాచార సంపన్ను లకు ఇదొక (మంచి) గుణపాఠం. (అన్ బియా: 83-84)

2) భరించరాని దుఃఖంతో శోక సముద్రంలో నిండా మునిగిన వ్యక్తి మాటలను అల్లాహ్ ఎలా నిర్లక్ష్యం చేశాడు అని ఆశ్చర్యమేస్తుంది.

మత్స్య బాధితుడి సంగతి జ్ఞాపకం తెచ్చుకో. అతను కోపం వచ్చి వెళ్ళిపోయాడు. మేము తనను నిలదీయబోమని భావించాడు. చివరికతను (చేప కడుపులో చిక్కుకొని) గాఢాంధకారంలో "నీవు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నీవు పరిశుద్ధుడవు. నేనే నిజంగా ఆత్మద్రోహిని" అని మొరపెట్టుకున్నాడు. మేమతని మొరాలకించి అతడ్ని బాధ, పరితాపాల నుండి విముక్తి కల్గించాం. ఇలాగే మేము విశ్వాసుల్ని రక్షిస్తాం. (అన్ బియా: 87-88)

3) సంతాన లేమితో నిరాశా నిస్పృహలకు లోనై మానసిక ఒత్తిడికి లోనైన వ్యక్తి మాటలను అల్లాహ్ ఎలా నిర్లక్ష్యం చేస్తాడా?

జకరియ్యా వృత్తాంతం కూడా జ్ఞాపకం తెచ్చుకో. అతను తన ప్రభువు సన్నిధిలో "ప్రభూ! నన్ను (సంతానం లేకుండా) ఒంటరివాడ్ని చేయకు. నీవే అందరికంటే మంచి వారసుడివి" అని ప్రార్థించాడు. మేమతని ప్రార్థనను ఆలకించి అతనికి యహ్యాను అనుగ్రహించాం. అతని కోసం అతని భార్యను

(గర్భధారణకై) యోగ్యురాలిని చేశాము. వీరంతా అమితోత్సాహంతో సత్కార్యాలు చేస్తుండేవారు. మమ్మల్ని ఎంతో ఆశతో, భయభక్తులతో ప్రార్థించేవారు. మా ముందు ఎంతో అణకువతో ఉండేవారు. (అంబియా: 89-90)

4) ఏ వ్యక్తికీ వ్యతిరేకంగానైతే ప్రజలు కుట్రలు పన్నుతున్నారో ఆ వ్యక్తి మాటను అల్లాహ్ ఎలా నిర్లక్ష్యం చేస్తాడు? అని ఆశ్చర్యమేస్తుంది.

నేను మాత్రం నా వ్యవహారాన్ని దేవునికి అప్పగిస్తున్నాను. ఆయనే తన దాసులకు సంరక్షకుడు. "చివరికి అల్లాహ్ వారు పన్నిన కుట్రలు, కుయుక్తులన్నిటిని వమ్ముచేసి ఆ విశ్వాసిని కాపాడాడు. ఫిరౌన్ అనుయాయులే ఘోర విపత్తులో చిక్కుకొని సర్వనాశనమయ్యారు. (మోమిన్: 44-45)

5) భయంతో బిక్కుబిక్కుమంటూ బతికే వ్యక్తి ఎలా అల్లాహ్ యొక్క ఈ మాటను నిర్లక్ష్యం చేస్తాడు? అని ఆశ్చర్యమేస్తుంది.

వారు ద్విగుణీకృత విశ్వాసంతో "మాకు అల్లాహే చాలు, ఆయన గొప్ప కార్యసాధకుడు" అని సమాధానమిచ్చారు. చివరికి వారు అల్లాహ్ అనుగ్రహంతో, బహుమానాలతో తిరిగి వచ్చారు. వారికి ఎలాంటి నష్టం జరగలేదు. వారు అల్లాహ్ అభీష్టం ప్రకారం నడుచుకున్నారు. దేవుడు (ఇలాంటివారికే) అపారంగా అనుగ్రహించేవాడు. (ఆలి ఇమ్రాన్: 172-174)

మనం ఎన్ని అనుగ్రహాలలో ఉన్నామో ఒక్కసారి నెమరు వేసుకొండి, అప్పటికీ అర్థం కాకపోతే ఒకే ఒక్కసారి పాలస్తీనా ప్రజల్ని జ్ఞప్తికి తెచ్చుకోండి.

ఇప్పటివరకు ఇజ్రాయిల్ బాంబుల దాడికి మృతి చెందిన పాలస్తీనీయన్లు 8000 మంది కాగా, వారిలో 2/3 వంతు మంది పిల్లలు, మహిళలే ఉన్నారు. రెండు మూడుసార్లు వేదికెక్కి ఆ పీడిత ప్రజల గురించి మాట్లాడితేనే, నాలుగైదు పేజీల వ్యాసం వారి గురించి రాస్తేనే విసుగు చెందే ప్రబుద్ధులు నేడు మన మధ్య చాలా మందే ఉన్నారు. అయితే అక్కడ వారు 75ఏళ్లుగా భీకర వాతావరణంలో జీవిస్తున్నారు.. వారి సొంత గడ్డపై భద్రత లేని బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇప్పుడు జరుగుతున్న ఈ మారణకాండ వారిని పూర్తిగా తుదముట్టించేంత వరకు ఆగేలా లేదు. రక్షించేవారు లేక 'మా ప్రాణాలు గాల్లో తేలుతున్నాయి' అని అక్కడి తల్లుల రోదిస్తున్నారు.

దిక్కులేక పోవడం చూసి అణచి వేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు?

## జర్మనీలో పెరుగుతున్న ఇస్లామోఫోబియా

బెర్లిన్‌లోని జర్మన్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేషన్ అండ్ మైగ్రేషన్ రీసెర్చ్ నవంబర్ 7వ తేదీన విడుదల చేసిన ఒక అధ్యయనం ప్రకారం, జర్మనీలో 40% మంది ముస్లిం పురుషులు ప్రతిరోజు జాత్యహంకారాన్ని ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. ప్రత్యేకించి పోలీసుల విభాగంలోను ఇస్లామోఫోబియా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ అధికారులతో వ్యవహరిస్తున్నప్పుడు వివక్ష తప్పడం లేదు. పోలీసులతో వ్యవహరిస్తున్నప్పుడు ముస్లిం పురుషులలో 39% కన్నా ఎక్కువ మంది వివక్షను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఇస్లామోఫోబియాను ముస్లింపురుషుల్లో 51% మంది ప్రతిరోజు ఎదుర్కోవలసి వస్తోంది. ముస్లిం మహిళల్లో, 46% మంది ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ అధికారులతో వివక్షను ఎదుర్కొంటున్నారు. జర్మనీ వైద్య ఆరోగ్య వ్యవస్థలో వివక్షను కూడా ఈ అధ్యయనం హైలైట్ చేసింది. జాతిపరమైన వివక్ష చాలా ఎక్కువగా ఉందని ఈ అధ్యయనం నిర్వహించిన సెంటర్ డైరెక్టర్ ఫ్రాంక్ కల్టర్ పేర్కొన్నారు. అక్టోబరు 7న గాజా యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి జర్మనీలో ముస్లిం జాత్యహంకారం. జర్మనీలో ముస్లింలపై దాడులు పెరిగాయి. ఈ జాత్యాహంకారాన్ని, ఇస్లామోఫోబియాను సహించేది లేదని ప్రభుత్వ ప్రతినిధి స్టెఫెన్ హెబెస్ట్రీట్ నొక్కిచెప్పారు. బెర్లిన్‌కు చెందిన అలయన్స్ అగైనెస్ట్ ఇస్లామోఫోబియా, ముస్లిం విద్వేష వ్యతిరేక సంఘాలు జర్మనీలో పరిస్థితి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. గాజాలో ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం నేపథ్యంలో ముస్లిం వ్యతిరేక జాత్యహంకారం పెచ్చరిల్లిందని హెచ్చరించింది. కేవలం రెండున్నర వారాల వ్యవధిలో ముస్లిం వ్యతిరేక బెదిరింపులు, హింస, వివక్షకు సంబంధించిన 53 కేసులు నమోదు అయ్యాయి, మసీదులపై 10 దాడులు జరిగాయి. ముస్లిం వ్యతిరేక జాత్యహంకారాన్ని ఎదుర్కోవడానికి, బాధితులను కాపాడ్డానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈ నగరం నుండి మమ్మల్ని బయటికి తీసి కాపాడు. మాకు రక్షణ కల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా నీవైపు నుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టుకుంటున్నారే! అలాంటి పీడిత ప్రజల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు? (అన్నిసా: 74-75)

గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు మంచినీరు దొరక్క.... ఆకలి తీర్చుకోవడానికి పట్టెడన్నం లభించక వారు అల్లాడిపోతున్నారు. బాధితుల ఆర్తనాదాలు అధికమవుతున్న కొద్దీ ఆసుపత్రుల్లో ప్రాథమిక ఔషధాలూ నిండుకొంటున్నాయి. మాటలకు అందని మానవతా సంక్షోభమిది... మృగాలకంటే హీనంగా అకారణంగా అమాయకుల ఉసురుపోసుకుంటున్న బెంజమిన్ నెతన్యాహు నరహంతక నైచ్యమిది! వారి కోసం మనకు చేతనయినంత సహాయం చేద్దాం! వారి కోసం చేతులెత్తి ప్రార్థిద్దాం!!

జీవితం అనే యుద్ధంలో గెలవడానికి ధైర్యాన్ని మించిన ఆయుధం లేదు... అంటారు పెద్దలు. మానవ జీవితం నిత్యం సంఘర్షణలతో కలిసి ప్రయాణిస్తుంది. సాలెపురుగు గూడు కట్టడంలో ఎంతో నేర్పరితనం ప్రదర్శిస్తుంది. తను అల్లుకునే గూటిలో చిన్న దోషం కూడా రాకూడదు. ఎక్కడ తేడా వచ్చినా ఆ గూడు వదిలేసి, మరో గూడు కట్టుకోవటం మొదలు పెడుతుంది.

ప్రతి ప్రాణి జీవితంలో కష్టాలు, ఇబ్బందులు, అపాయాలు ఎదురవ్వటం సర్వసాధారణం. వాటిని ఎదుర్కోవటానికి నిరంతరం పోరాడుతూనే ఉండాలి. పోరాటానికి ధైర్యం అవసరం. ఆ ధైర్యాన్ని విడిచిపెట్టకుండా ఉండాలని మన ప్రవక్తల గాథలు, వీర జవానుల కథలు ... మరెన్నో మనకు బోధిస్తున్నాయి.

విశ్వాసులారా! మీకు పూర్వం విశ్వాసులకు వచ్చిన (కష్టాల)న్నీ మీపై రాకముందే మీకు ఇట్టే స్వర్గప్రవేశం లభిస్తుందని భావిస్తు న్నారా? ఆనాటి విశ్వాసులపై ఎన్నో కష్టాలు, కడగండ్లు విరుచుకు పడ్డాయి. వారు కుదిపివేయబడ్డారు. చివరికి అప్పటి దైవప్రవక్త, ఆయన సహచరులైన విశ్వాసులు (ఆ కష్టాలకు తట్టుకోలేక) "దైవ సహాయం ఎప్పుడు వస్తుంది?" అని అడగసాగారు. అప్పుడు వారికి "ఇదిగో దైవసహాయం సమీపంలోనే ఉంది" (అని ధైర్యం చెప్పడం జరిగింది). (బఖర - 214)

మానవ జీవితం కూడా సంఘర్షణలతో నిండి ఉంటుంది. నిరంతరం పోరాడుతూనే ఉండాలి. విజయం సాధించేవరకు ధైర్యాన్ని విడిచిపెట్టకూడదు.

ఒక చీమ తన కంటే మూడు రెట్లు బరువుని మోయగలదు. అలా మోసేటప్పుడు ఎన్నోసార్లు అది పడిపోతుంటుంది. కానీ, గమ్యం చేరేవరకు తన ప్రయత్నాన్ని విడిచిపెట్టదు. గాలికి ఎదురీదుతూ, లక్ష్యాన్ని చేరుకుంటుంది.

గిజిగాడు గూడు చాలా ప్రత్యేకంగా ఉంటుంది. లోపల రెండు గదులుగా నిర్మిస్తుంది. గూటి నిర్మాణంలో ఏ చిన్న తేడా వచ్చినా, ఆ గూటిని విడిచిపెట్టి, వేరే గూటిని అల్లుతుంది. లోపం లేకుండా వచ్చేవరకు గూడు కట్టడానికి ఎక్కడా ధైర్యం కోల్పోదు. సృష్టిలోని ప్రతి ప్రాణీ తన లక్ష్యం సాధించుకునే వరకు ధైర్యంగా పోరాడు తూనే ఉంటుంది. కానీ, మానవుల విషయంలోనే అధైర్యం కనిపిస్తుంది. ధైర్యాన్ని కోల్పోయిన మరుక్షణం మనిషి అన్ని విషయాల్లోనూ అపజయం చవిచూస్తాడు. ఎందులో గెలవాలన్నా ధైర్యమే అసలైన ఆయుధం.

ఒక్క మాటలో చెప్పాలంటే -

(విశ్వాసులారా!) బాధపడకండి. అధైర్యంతో క్రుంగిపోకండి. మీరు నిజమైన విశ్వాసులైతే చివరికి మీరే విజయం సాధిస్తారు. (సత్యా సత్యాల సమరంలో) మీరే కాదు, వారు కూడా దెబ్బతిన్నారు. (ఆ మాత్రానికే ధైర్యం కోల్పోవడమా!) ఇవన్నీ మేము ప్రజల మధ్య తిప్పే కాలపు మిట్టపల్లాలు మాత్రమే. ఆయన మీలో నిజమైన విశ్వాసులెవరో పరీక్షించడానికి, కొందరిని సత్యానికి సాక్షులు (అమరగతులు)గా చేయడానికి ఈ విధంగా చేశాడు. అల్లాహ్ దుర్మార్గుల్ని ఎన్నటికీ ప్రేమించడు. ఆయన ఇలాంటి పరీక్ష ద్వారా నిజమైన విశ్వాసులు ఎవరో ఏరివేసి, అవిశ్వాసుల్ని అణచి వేయదలిచాడు. (ఆలి ఇమ్రాన్: 139-141)

పై పరిస్థితుల్ని ఆసరాగా చేసుకొని కొందరు బురద బుద్ధి ప్రబుద్ధులు తరువాత మీరే అన్నట్టు ఎగాదిగా చూడటం మనం గమనిస్తాము. దేశం ఏదైనా, ప్రాంతం ఏదైనా విశ్వాసులు దుర్మార్గులకు కొమ్ము కాయరు. అదరరు. బెదరరు. కావాలంటే బార చాచి నిలబడ్తారు .

## చివరి మాట

నీళ్లకు బదులు నిప్పులు కురిసినా- ప్రమాద అగ్ని పర్వతాలే పెల్లుబికినా- శోక సముద్రాలే అలలెత్తినా- మనం మాత్రం వెన్ను చూపక ధైర్యంగా ముందుకు సాగాలి. నరాలు తెగిపడి నెత్తురు కారినా- నరమేధాలే నేల నాలుగు చెరగులా కరాళ నృత్యం చేసినా- ధర్మం కోసం ప్రాణం పోయినా అబద్ధమాడకు, అధైర్యపడకు.




**సంస్కారం** అనేది చదువు నుండి వస్తుందా లేక కుటుంబం నుండి వస్తుందా? చదువు-సంస్కారం కోసం స్కూల్‌కు, కాలేజీలకు వెళ్తున్నారు. కానీ సంస్కారం నేర్చుకుంటున్నారా?

చదువు వేరు, సంస్కారం వేరు. చదువు విజ్ఞానాన్ని బోధిస్తుంది. చదివిన చదువుతో సంస్కారం అలవర్చుకోవటం చదువుకు గౌరవం. అది విస్మరిస్తే చదువుకు అర్థం లేదు. చిన్నతనం నుండి ఇంట్లో నేర్పవలసినది ఈ సంస్కారం. కానీ దురదృష్టవశాత్తు తల్లిదండ్రులకు ఏమరుపాటు లేకుండా ప్రతిక్షణం గమనించే తీరిక, ఓపిక లేవు. తండ్రి తన సంతానానికి ఇవ్వగలిగిన అత్యుత్తమ బహుమానం ఉత్తమ విద్య, శిక్షణలే. తల్లిదండ్రులు తమ సంతానానికి ఎన్నో కానుకలు బహుకరిస్తారు. ఆస్తిపాస్తులు, డబ్బు, పదవీ హోదాలు, సమాజంలో స్థానం ఇత్యాదివి ఎన్నో భౌతిక విశేషాలు సంతానానికి తల్లిదండ్రుల ద్వారా లభిస్తాయి. ఉత్తమ విద్యా బుద్ధులు, సంస్కారవంతమైన నడవడే అసలు విలువైన కానుక. సంస్కారం లేకపోతే ఆస్తి, ధనం, స్థానం అన్నీ ఎంతోకాలం మనలేవు.

ఇప్పుడు పిల్లల మీద తోటి పిల్లల ప్రభావం, సమాజ ప్రభావం ఎక్కువ. నేటి సమాజంలో చదువు- సంస్కారం నేర్పడంలో విఫలం కావడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వినయంగా ఉండటం, పెద్దలను గౌరవించడం లాంటివి తెలియకుండా పోతున్నాయి. అహంకారం పెరిగింది. దీనికి నేటి తరం వారు బాధ్యత వహించాలి. సరిదిద్దే దిశగా అడుగులు వేయాలి. చదువు చెప్పే గురువులు నిస్వార్థంగా చెప్పాలి. నేర్చుకునే విద్యార్థులు వినయ విధేయతలతో నేర్చుకోవాలి. అప్పుడే మంచి సంస్కారం, చదువు వస్తాయి. మనిషికి తనకు ఉన్న విద్యా విజ్ఞానాలను కొంత ప్రదర్శించి, కొందరు ప్రశంసించగానే ఉబ్బి తబ్బి అయినా ఫరవాలేదు. కానీ నన్ను దెబ్బ తీయటం ఎవడబ్బ తరం అని పొగరుబోతుగా తల ఎగురవేస్తేనే చిక్కు. మనిషి ఎదుటి వారిని ఖాతరు చెయ్యడు. తన మొదటి వాన్ని లెక్కజెయ్యడు. తన నుదుటి రాతను గుర్తు చేసుకోడు. తనే సర్వం, తనే ఆది, తనే అంతం అనుకుంటాడు. అందుకే ఒడిలో ఉన్నప్పటి నుండి అసువులు బాసేంతవరకు విద్యాసముపార్జన చేయండి.

ఎవరైతే మీకు విద్యాబోధన చేశారో వారిని గౌరవించండి. ఆ రోజుల్లో పాఠశాలల్లో సంస్కారంతో కూడిన చదువు చెప్పేవారు. ఉపాధ్యాయులకు చాలా గౌరవం ఉండేది. తల్లిదండ్రులు మా పిల్లలను కొట్టినా, తిట్టినా మంచి సంస్కారం చదువు నేర్పండని వేడుకునేవారు. ఉపాధ్యాయులు కూడా మొరటుగా కాకుండా జాగ్రత్తగా దండించి చదువు చెప్పేవారు. కానీ ఈ రోజుల్లో విద్యార్థుల్లో క్రమశిక్షణ తగ్గింది. ఏ తల్లిదండ్రులు అయితే దండించి చదువు, సంస్కారం నేర్పమన్నారో ఆ తల్లిదండ్రులే వచ్చి ఉపాధ్యాయుడు దండిస్తే వెంటనే తగాదా పడుతున్నారు. అంతేకాదు ఉపాధ్యాయుడిపై దాడికి కూడా వెనుకాడడంలేదు. దీంతో క్రమశిక్షణ పూర్తిగా అటకెక్కింది. దీనికితోడు ఉపాధ్యాయుల్లో అంకితభావం తగ్గింది. ఆ తర్వాత చదువులు వ్యాపారంగా మారాయి. ఈ వ్యాపారం చేసే పాఠశాలలు సంస్కారం ఎలా నేర్పుతాయి. ఈ రోజుల్లో చిన్న కుటుంబాల ఎక్కువయ్యాయి. తాతయ్యలు, అమ్మమ్మలు పెంచడం వారి నుండి జీవన విలువలు తెలుసుకోవడం మరిచిపోయారు. తల్లిదండ్రులు వారి పెద్దవారిని గౌరవిస్తే కదా పిల్లలు వారి నుండి పెద్ద వాళ్ళను ఎలా గౌరవించాలో నేర్చుకునేది?

ఇలా పిల్లలలో సంస్కారం, క్రమశిక్షణ లేకపోవడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మొత్తం బాధ్యత వహించాలి. మనమంతా మారితేనే పిల్లలకు సంస్కారంతో కూడిన చదువు వస్తుంది. మన ఆలోచనా విధానం, జీవన విధానం పూర్తిగా మారాలి. అప్పుడే అది సాధ్యం. చెబితే వచ్చేది కాదు సంస్కారం. పిల్లలు చూసి నేర్చుకుంటారు. పెద్దవాళ్ళు ఆదర్శంగా ఆచరిస్తేనే పిల్లలకు సంస్కారం వస్తుంది. గొప్ప ధన సంపదలు లేకపోయినా ఫర్వాలేదు కానీ విద్య, సంస్కారం, సత్ప్రవర్తన లాంటి సంపదలుంటే మంచి పేరు, ప్రతిష్టలు సముపార్జించి పెడతాయి. అందుకే చదువు, సంస్కారం ఉండాలి అంటారు.

# సిరా చుక్కలు శోకసంద్రంలో

మాతృ భూమిని లాక్కొని
మరు భూమి గా మార్చిన
నిస్సహాయతకు
ప్రతిఘటనా పోరాటమిది!
అణచివేతల ఉక్కుపాదాన్ని
అడ్డుకుని స్వేచ్ఛా వాయువులను
పీల్చుకునే పొలికేకిది!
చీకట్లలో తచ్చాడుతున్న
దేశదిమ్మరులను ఆశ్రయమిచ్చిన పాపానికి ప్రాయశ్చిత్తమిది!

ఉగ్రవాదులనే నిందల అగ్నిజ్వాలల్లో
మాడి మసైపోతున్న
గాజా వ్యధాభరిత గాధ ఇది!
శరణార్థ శిబిరాలలో శిథిలమైన
మానవత్వపు రుధిర గీతాల రక్త తర్పణ ఇది!
గాజు పెంకుల్లా భళ్ళున
నేలరాలిన గాజా వాసుల గూడులు
చెదిరిన కలల కన్నీటి గాయమిది!

పవిత్ర భూమిపై నడయాడిన
ప్రవక్తలను సైతం హతమార్చిన పాపిస్టులు!!
చిన్నారి పసికందుల రక్తాన్ని చిందించే చరిత్రలో సిద్ధ హస్తులు!!
అణ్వాస్త్రాలే ఆయుధాలై
హూంకరిస్తున్న అగ్రరాజ్య దురహంకారానికి
జియోనిస్టుల జాతితత్వ దాష్టీకానికి
ఆత్మరక్షణే శిరస్త్రాణంగా ధరించి కదిలే నా
పలస్తీనా పసి మనస్కులకు
పర్వత శిఖరాగ్ర స్థైర్యాన్ని చాటుతున్న మాననీ మణులకు
శ్రద్ధాంజలి ఘటించేందుకు నా కలంలో కన్నీటి సుడుల తప్ప మరేమీ లేవు!!

సిరా చుక్కలు శోక సముద్రంలో
విషాద గీతాలను ఆలపిస్తున్నాయి!
మానవత్వం మరిచిన
జాతితత్వ పరాకాష్టతను
కుళ్ళి కుళ్ళి శపిస్తున్నాయి!!
పలస్తీనీయుల ఆత్మ శాంతికై
అశ్రుతర్పణలు కురిపిస్తున్నాయి!!

**"అక్సా"ను కాపాడుకునే అమరవీరుల గాధలు విజయతీరాలు చేరుకుంటాయనే ఆశతో వేయి కళ్ళతో నిరీక్షిస్తూ దైవాన్ని వేడుకుంటున్నాయి!!!!????**

**– బతూల్ హుమైర్వీ**




## తెలంగాణ ముస్లిం ఓట్ల కోసం కాంగ్రెస్ కసరత్తులు

తెలంగాణ జనాభాలో దాదాపు 12.7% ఉన్న ముస్లిం సమాజం నుండి మద్దతు పొందేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మైనారిటీ సంక్షేమంపై పార్టీ దృష్టి పెట్టింది. కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, తెలంగాణ పీసీసీ చీఫ్ ఎ. రేవంత్‌రెడ్డి విడుదల చేసిన కాంగ్రెస్ మైనారిటీ డిక్లరేషన్‌లో సమగ్ర వాగ్దానాలు ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది అబ్దుల్ కలాం తౌఫా-ఎ-తాలీమ్ పథకం, దీని కింద M.Phil, Ph.D పూర్తి చేసిన ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, ఇతరులతో సహా మైనారిటీ యువతకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తారు. హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, వంటి ప్రాంతాల్లోని 119 అసెంబ్లీ స్థానాల్లో కనీసం 40 స్థానాల్లో ముస్లిం ఓటర్ల ప్రభావం బలంగా ఉంది. మహబూబ్‌నగర్, సికింద్రాబాద్‌లలో మైనారిటీలకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ తన వాగ్దానాల డిక్లరేషన్‌లో ఇమామ్‌లు, మోజన్‌లు, ఖాదీమ్‌లు, పాస్టర్లు, గ్రంథిలతో సహా అన్ని మతాలకు చెందిన మత పెద్దలకు నెలవారీ రూ. 10,000 నుంచి 12,000 గౌరవ వేతనం ఇస్తామన్నారు. మైనారిటీ సంక్షేమ బడ్జెట్‌ను రూ. 4,000 కోట్లకు పెంచుతామని, ప్రత్యేక మైనార్టీ సబ్ ప్లాన్‌ను అమలు చేస్తామని పార్టీ హామీ ఇచ్చింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడానికి రూ. 1లక్ష, గ్రాడ్యుయేషన్‌కు రూ. 25,000, ఇంటర్మీడియట్‌కు రూ. 15,000, 10వ తరగతి విద్యార్థులకు రూ.10,000, కొత్తగా పెళ్లైన జంటలు రూ.1,60,000 ఇస్తామని చెప్పారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, ఇతర మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన వారందరికీ ఇవి వర్తిస్తాయి. హిందువులు, ముస్లింలు దేశానికి రెండు కళ్లుగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వైఖరిని ఉద్ఘాటించారు.

## తెలంగాణలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్

తెలంగాణ రాజకీయ రంగంలో, రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్‌ను కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా నిలిపింది. ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్న నిజామాబాద్ అర్బన్‌లో 1952 లోను, 1957లోను కేవలం రెండుసార్లు మాత్రమే ముస్లిం ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. మొత్తం 19 లక్షల మంది ఓటర్లున్నారు. ఇందులో 1.2 లక్షల మంది ముస్లింలు ఉన్నప్పటికీ ఈ సీటును తరచుగా మున్నూరు కాపు కులానికి చెందిన అభ్యర్థులు గెలుస్తున్నారు. ఇక్కడ బీజేపీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని, బీఆర్ఎస్ వైశ్య వర్గానికి చెందిన అభ్యర్థిని నిలబెట్టాయి. 2018 ఎన్నికల్లో వైశ్య వర్గానికి చెందిన గణేష్ మజ్లిస్ మద్దతుతో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన తాహిర్ బిన్ హమ్దాన్‌పై 26,055 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ బీజేపీ కూడా బలంగానే ఉంది. ముస్లింలు అధికంగా ఉండే ఈ నియోజకవర్గంలో కీలకమైన ఎన్నికల పోరులో ముహమ్మద్ అలీ షబ్బీర్ ఎలాంటి ఫలితాలు సాధిస్తారో వేచి చూడాలి.

## ఎన్నికలకు ముందు ఉమ్మడి పౌరస్మృతి

ఉత్తరాఖండ్‌లోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం, యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేయడానికి సిద్ధపడింది. ఈ చర్యపై ముస్లిముల నుంచి తీవ్రమైన అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తుతాయని పలువురు భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సెషన్‌లో UCC ప్రవేశపెట్టి ఆమోదించాలని భావిస్తున్నారు. బహుభార్యత్వంపై నిషేధం, అన్ని మతాలలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తతకు సంబంధించిన చట్టాలు ఒకేవిధంగా ఉండేలా చేస్తామని అంటున్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఉమ్మడి పౌరస్మృతి ఓట్ల వాన కురిపిస్తుందని నమ్ముతున్నాడు. 2022 ఎన్నికల్లో ఉమ్మడి పౌరస్మృతి తెస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి నిపుణుల కమిటీ, మే 27, 2022న ఏర్పాటు చేయబడింది, UCC ముసాయిదాపై తన తుది నివేదికను త్వరలో సమర్పించాలని చూస్తున్నారు. ఉమ్మడి పౌరస్మృతి అమలు చేసే ప్రయత్నాలు కేవలం ఉత్తరాఖండ్‌కే పరిమితం కాదు, బిజెపి పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో కూడా ఇదే విధమైన చర్యలు ప్రారంభమయ్యాయి. భారతదేశంలోని అతిపెద్ద మైనారిటీ వర్గమైన ముస్లింల మతపరమైన స్వయంప్రతిపత్తిని అణగదొక్కే లక్ష్యంతో ఉమ్మడి పౌరస్మృతిని బిజెపి దూకుడుగా తీసుకువస్తుందని విమర్శకులు వాదిస్తున్నారు. భారత రాజకీయాల్లో UCC చర్చ చాలా కాలంగా జరుగుతోంది. ముసాయిదాపై లా కమిషన్ ఆఫ్ ఇండియా ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించింది. ఉమ్మడి పౌరస్మృతి కోసం జరుగుతున్న ఈ ప్రయత్నాలను గమనిస్తే మైనారిటీల పట్ల మోడీ ప్రభుత్వం ఎలాంటి విధానం కలిగి ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. ముస్లిం గుర్తింపు, ప్రయోజనాలు, హక్కులను దెబ్బతీయడం ద్వారా ఓట్లు పొందవచ్చనే మతరాజకీయాలే ఈ ప్రయత్నాల వెనుక ఉన్నాయని పలువురు వాదిస్తున్నారు. దేశాన్ని నిర్వచించే వైవిధ్యాన్ని విస్మరిస్తూ ఒకే చట్రంలో భారతీయ సమాజాన్ని ఇరికించే చర్యల్లో భాగంగానే ఈ ప్రయత్నాలను చాలా మంది చూస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో UCC అమలు ఇతర రాష్ట్రాలకు ఒక ఉదాహరణగా మారవచ్చు. మైనారిటీ హక్కులను కాలరాసే ప్రయత్నాలు మరింత పెరగవచ్చు.

## పాకిస్తాన్‌లో నానాటికి దిగజారుతున్న పరిస్థితి

నవంబర్ 9వ తేదీన Livemint నివేదిక ప్రకారం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న పాకిస్తాన్ రెండు చైనీస్ బ్యాంకుల నుండి 600 మిలియన్ డాలర్ల తాజా రుణాలను కోరింది. పాకిస్తాన్ ఎంతగా చైనాపై ఆధారపడి మనుగడ సాగిస్తుందో దీన్ని పట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ రుణాల కోసం ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా, బ్యాంక్ ఆఫ్ చైనాతో పాకిస్తాన్ ప్రతినిధుల చర్చలు జరుగుతున్నాయి, ఒక్కో బ్యాంకు 300 మిలియన్ డాలర్ల రుణం అందించాలని పాకిస్తాన్ కోరుతోంది. మరోవైపు అంతర్జాతీయ ద్రవ్యనిధితో బెయిల్ ఔట్ ప్యాకేజ్ కోసం చర్చలు జరుగుతున్నాయి. 3 బిలియన్ డాలర్ల బెయిలౌట్ ప్యాకేజీ ఇది. దీనికి సంబంధించిన రెండవ విడత నిధుల విడుదల కోసం పాకిస్తాన్ IMFతో చర్చలు జరుపుతోంది. పాకిస్తాన్ ఎలాంటి భయంకరమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కు కుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. పాకిస్తాన్ నేతల సంకుచిత, హ్రస్వ రాజకీయ దృష్టి, స్వార్థ రాజకీయ వ్యూహాల ఫలితంగా దేశం దివాలా తీసింది, ఇప్పుడు పాకిస్తాన్ మనుగడ కోసం అప్పులపై ఆధారపడుతోంది. 2000 సంవత్సరం తర్వాతి నుండి, చైనా పాకిస్తాన్‌కు 21.2 బిలియన్ డాలర్ల రుణాలను అందించింది. పాకిస్తాన్ అంతర్జాతీయ రుణాల్లో చైనా నుంచి తీసుకున్న రుణాలు 30%. డిఫాల్ట్ గండం గట్టెక్కడానికి, విదేశీ కరెన్సీ నిల్వలను కొద్దోగొప్పో పెంచుకోడానికి తీసుకున్న రుణాలివి. నెమ్మదిగా పాకిస్తాన్ చైనా తాకట్టులోకి వెళ్ళిపోతోంది. పేలవమైన క్రెడిట్ రేటింగ్‌ల వల్ల పాకిస్తాన్ ఆర్థిక కష్టాలు మరింత పెరుగుతున్నాయి. విదేశీ వాణిజ్య రుణాలను పొందడం సవాలుగా మారింది. 5 బిలియన్ డాలర్ల విదేశీ వాణిజ్య రుణాలు ఉన్నాయి, మూడు అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు పాకిస్తాన్‌ను డౌన్‌గ్రేడ్ చేశాయి. అందువల్ల కొత్త రుణాలు పొందడం మరింత కష్టమవు తోంది. పాకిస్తాన్ పాలకులు స్వార్థరాజకీయాలతో, హ్రస్వదృష్టితో దేశ సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేసి పరాధీన దేశంగా మార్చేశారు.

## హమాస్‌కు మద్దతిస్తామని పునరుద్ఘాటించిన మలేషియా ప్రధాని

మలేషియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం, నవంబర్ 9వ తేదీన ఒక ప్రకటనలో హమాస్‌కు పూర్తి మద్దతిస్తున్నట్లు పునరుద్ఘా టించారు. హమాస్‌పై ఆంక్షలు విధించాలని ఒకవైపు అమెరికా ఒత్తిడి తెస్తున్నప్పటికీ మలేషియా ఈ ఒత్తిడికి తలొగ్గలేదు. హమాస్‌కు తమ మద్దతు కొనసాగుతుందని అన్నారు. మలేషియా దౌత్యపరంగా ఇజ్రాయెల్‌ను గుర్తించలేదన్నది కూడా గమనిం చాలి. మలేషియా దీర్ఘకాలికంగా, పాలస్తీనాకు పూర్తి మద్దతు




ఇస్తోంది. ఈ వైఖరికి పూర్తిగా కట్టుబడి ఉంది. అమెరికా ఒత్తిడి లేదా దేశంలోని రాజకీయాలకోసం మలేషియా పాలకులు తమ వైఖరి మార్చుకోవడం లేదు. కాని మరోవైపు ఫేక్ వార్తల ప్రచారం ఉధృతమవుతోంది. విదేశాంగవిధానం విషయంలోను, ఇతర కీలకమైన విషయాల్లో ఫేక్ వార్తలు సృష్టించే గందరగోళాన్ని అన్వర్ ఇబ్రాహీం వేలెత్తి చూపించారు. పాలస్తీనా సొలిడారిటీ వీక్ సందర్భంగా మలేషియా ఉపాధ్యాయులు మిలిటెంట్ల వేషం ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. మలేషియాలో పాలస్తానా పట్ల పూర్తి సంఘీభావం కనిపిస్తోంది. హమాస్‌ను ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, నెల్సన్ మండేలా పోరాటాలతో అన్వర్ పోల్చారు. హమాస్ యోధులను "మిలిటెంట్‌లు"గా వర్ణించవద్దని మీడియా సంస్థలను ఆయన కోరారు. ఈ పోలిక పాశ్చాత్య మీడియాలో చాలామందికి నచ్చడం లేదు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాత్యాహంకా రాన్ని నేలకూల్చిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెసుతో హమాస్ ను పోల్చడం వారికి మింగుడుపడడం లేదు.

## దౌత్యవైఫల్యమే మాజీ నౌకాదళాధికారులకు శాపమయ్యిందా?

నవంబర్ 9వ తేదీన లైవ్‌మింట్ నివేదిక ప్రకారం మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానంలోని లోపాల వల్లనే ఖతార్‌లో భారత మాజీ నౌకాదళాధికారులు మరణశిక్షకు గురయ్యారని తెలుస్తోంది. దోహాకు చెందిన దహ్రా గ్లోబల్‌లో పనిచేస్తున్న ఆ అధికారులను ఆగస్టు 2022లో అరెస్టు చేశారు. వారు ఇస్రాయిల్ కోసం గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలు వారిపై మోపారు. దౌత్యపరంగా భారత్ ప్రయత్నించినప్పటికీ ఖతార్ కోర్టు వారికి అక్టోబర్ 26 న మరణశిక్ష విధించింది. అంతర్జాతీయ సంబంధాల విషయంలో, ముఖ్యంగా పశ్చిమాసియా దేశాలతో సంబంధాల విషయంలో మోడీ ప్రభుత్వం ఎంతగా విఫలమయ్యిందో ఈ సంఘటన చాటి చెబుతోంది. ముందుచూపు లేకుండా వ్యవహరిం చడం, అంతర్జాతీయ పర్యవసానాలను అంచనా వేయలేకపోడం వంటి అనేక లోపాల వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శకులు అంటున్నారు. ఈ సంఘటన వల్ల పశ్చిమాసియాలో భారతదేశ ప్రతిష్ట, ఇక్కడి దేశాలతో సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది. మోడీ ప్రభుత్వం కేసు విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శ బలంగా వినిపిస్తోంది. అంతర్జాతీయ రాజకీయాల పట్ల అవగాహనాలేమికి ఇది నిదర్శనంగా చాలా మంది చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యూహాత్మక సంబంధాల కంటే స్వల్పకాలిక లాభాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శ వినిపిస్తోంది. దీనివల్ల అనేక దేశాలతో సంబంధాలు దెబ్బతింటున్నాయని అంటున్నారు.

# అహంకారం ఏమాత్రం పనికిరాదు

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**పూర్వకాలం మాట**. పట్టణానికి దగ్గర ఇమాంబాద్ అనే ఊరు ఉండేది. ఆ ఊరిలో జమీందారు ఉండేవాడు. అతను ఎప్పుడు నా కష్టం వల్లే ఇంత పెద్ద ధనవంతుడయ్యాను అని తరచు చెప్పేవాడు. బీదవారికి చాలా అసహ్యించుకునేవాడు. వారితో బాగా పని చేయించుకుని శ్రమకు తగ్గ వేతనం ఇచ్చేవాడు కాదు. ఎప్పుడైనా ఎవరైనా ఎదురు తిరిగితే కొరడా దెబ్బలు కొట్టేవాడు. ఆయన ప్రవర్తనతో ఊరు ప్రజలు చాలా అవస్థలు, బాధలు పడేవారు. దేవునిపై విశ్వాసం ఉంచేవాడు కాదు.

జమీందార్‌కు ఒకే ఒక కొడుకును అల్లారు ముద్దుగా చూసుకునే వారు. జమీందారు భార్య కూడా భర్త అడుగు జాడల్లోనే నడిచేది. ఆమె కూడా దేవునిపై విశ్వాసం ఉంచేది కాదు. నా భర్త కష్టం వల్లనే హెూదా, సంపద, ఆస్తులు లభించాయని గట్టిగా భావించేది. కొడుకు హమీద్ ఎప్పుడూ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉండేవాడు. మొత్తం అల్లాహ్ ఇచ్చిన సంపద ప్రపంచం మొత్తం అల్లాహ్ సృష్టించినదే. చివరకు మన శరీరం కూడా అల్లాహ్ చెప్పిన విధంగానే నడుచుకోవాలి. ప్రతి పని ప్రారంభించేటప్పుడు 'బిస్మిల్లా' అని పలికేవాడు. ఈ మాటలు తల్లిదండ్రులకు నచ్చేవి కావు. పని పూర్తి అయితే 'అల్ హమ్దులిల్లాహ్' (అల్లాహ్‌కు కృతజ్ఞతలు) అని చెప్పేవాడు.

జమీందారు ఒక రోజు పట్టణానికి వెళ్ళి విలువైన బంగారు ఉంగరం మధ్యలో వజ్రం పెట్టించి ఇంటికి తీసుకొని వచ్చాడు. విలువైన బంగారు వజ్రం గల ఉంగరాన్ని కొడుకుకి ఇస్తూ ఈ ఉంగరాన్ని చేతికి భద్రంగా ఉంచుకోవాలని సూచించాడు. పోగొట్టుకుంటే ఇంటి నుంచి గెంటివేస్తాను అని హెచ్చరించాడు. హమీద్ 'బిస్మిల్లా' అని తీసుకొని గదిలోపలికి వెళ్ళి మూలకు ఉన్న బల్లపై పెట్టేశాడు. చేతి వేలికి ఎందుకు పెట్టుకోలేదని తండ్రి ప్రశ్నించాడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) పురుషులకు బంగారు ఆభరణాలు ధరించడం నిషేధం అన్నారు. అందువల్ల దానిని మూలకు పెట్టేశాను అని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

రాత్రికి కొడుకు పడుకున్న తర్వాత జమీందారు గదిలో వెళ్ళి ఆ ఉంగరాన్ని తీసుకొని తన పొలం భూమిలో దాచి పెట్టాడు. ఉదయాన్నే లేచి హమీద్‌కు ఉంగరాన్ని కావాలని గట్టిగా ప్రశ్నించాడు. హమీద్ పెట్టిన చోట వెతికాడు. తర్వాత ఇంట్లో మొత్తం చూశాడు. ఎక్కడ కూడా ఉంగరం దొరకలేదు. 'ఇన్‌షా అల్లాహ్' (దేవుడు తలిస్తే) నేను మీకు సాయంత్రం లోపు ఇచ్చేస్తాను అని చెప్పి నేరుగా పొలం దగ్గరకు వెళ్ళిపోయాడు. నాగలి కట్టి 'బిస్మిల్లా' (అల్లాహ్ నామంతో) అని దున్నడం ప్రారంభించాడు. దున్నేటప్పుడు జమీందారు దాచిపెట్టిన బంగారు ఉంగరం బయటకు వచ్చింది. హమీద్ వెంటనే ఆ ఉంగరాన్ని 'బిస్మిల్లా' అని తీసుకుని చూశాడు. అచ్చం అలాగే ఉంది. మెరుస్తూ ఉంది. బావి దగ్గరకు వెళ్ళి వుజూచేసి దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ సాష్టాంగంలో పడిపోయాడు.

సూర్యుడు అస్తమించే లోపే హమీద్ ఇంటికి వచ్చి తండ్రికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఉంగరాన్ని తండ్రికి ఇచ్చేస్తాడు. తండ్రి ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యాడు. హమీద్ జరిగిన విషయం మొత్తం చెప్పేస్తాడు. తండ్రికి మొత్తం విషయం అర్థమైపోయింది. మగ్రిబ్ నమాజ్ సమయం దాటిపోతుంది వెంటనే మస్జిద్ వైపు అడుగులేస్తాడు.

మస్జిద్ నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి తండ్రి కుర్చీ మీద కూర్చుని ఆలోచనలో మునిగిపోయి ఉన్నాడు. హమీద్‌ను చూడగానే లేచి నిలబడి తన కొడుకును కౌగిలించుకున్నాడు.

'బిస్మిల్లా' అనే పదంలో ఎంత బలం ఉందో, ఎంత శక్తి ఉందో ఇప్పుడు నేను తెలుసుకున్నాను. ఎల్లప్పుడూ దేవునిపై నమ్మకం ఉంచాలి. కష్టసుఖాలు వచ్చినప్పుడు దేవునిపై విశ్వాసంతో ముందుకు సాగాలి. ఆస్తులు, అంతస్తులు, హెూదాలు ఎన్ని ఉన్నా అహంకారం పనికిరాదు. తిరిగి మళ్ళీ దేవునివైపే పోవలసిందే. ఇహలోక జీవితం తాత్కాలికం. పరలోక జీవితం శాశ్వతం అని గ్రహించాడు.

వెంటనే సాష్టాంగంలో పడిపోయాడు. జీవితంలో జరిగిన తప్పులపై క్షమాభిక్ష కోసం అల్లాహ్‌తో వేడుకున్నాడు. ప్రతి పని బిస్మిల్లాతో ప్రారంభించాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**